	ఇఫ్తార్	సెహరి
	మంగళవారం	బుధవారం
కర్నూలు	6: 30	5:16
నంద్యాల	6: 26	5:16

రంజాన్ వేళలు

కర్నూలు నగరం నడిబొడ్డున హంద్రీ నది ప్రవహిస్తుంది. నదీతీరం, బఫర్ జోన్ అక్రమించి పలు ప్రాంతాల్లో పక్కా నిర్మాణాలు చేపట్టారు. ఆక్రమణలు తొలగించి నదిని సంరక్షించకపోగా.. రాజ్‌విహార్ సర్కిల్ నుంచి జోహరాపురం బ్రిడ్జి వరకు నది ఒడ్డును ఆనుకొని రహదారి నిర్మాణానికి నగర పాలక సంస్థ ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల పాత బస్తీ (ఓల్ట్ టౌన్) ప్రజలకు ఉపయోగమే. అయితే.. జలవనరుల శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా.. నిధులు మంజూరు చేయకుండా తాత్కాలిక మట్టితో నదిని పూడ్చేయడం విమర్శలకు తావిస్తుంది. నదిపై కాజ్‌వే కమ్ బిడ్జి, ఇరువైపులు రోడ్డు నిర్మాణం చేస్తే పర్యాటక కేంద్రంగా మారే అవకాశం ఉంది. పక్కా ప్రణాళిక లేకుండా డంపింగ్ యార్డు చెత్తతో కూడిన మట్టితో హంద్రీని నింపేయడం సరైంది కాదని తుంగభద్ర, కేసీ, హంద్రీ నదుల పరిరక్షణ కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు.

హంద్రీలో రోడ్డు


రాజ్‌విహార్ సర్కిల్ నుంచి రోడ్డు పేరుతో హంద్రీ నదిని పూడ్చేస్తున్న కార్పొరేషన్ అధికారులు

- రాజ్‌విహార్ సర్కిల్ నుంచి జోహరాపురం బ్రిడ్జి వరకు..
- మట్టితో నదిని నింపేస్తున్న వైనం
- అనుమతులు లేవంటున్న ఇరిగేషన్ అధికారులు
- నగరపాలక సంస్థకు లేఖ రాసిన ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఇంజనీర్లు

కర్నూలు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశ్చిమ ప్రాంతంలో పుట్టి తుంగభద్రలో కలిసే ఏకైక నది హంద్రీ. పత్తికొండ మండలం వందికోన కొండల్లో ఒక పాయగా, చిన్నహాల్తి ఎగువన మరో పాయ (వంక)గా ప్రవాహం మొదలై.. దేవనకొండ మండలం అలారుదిన్నె సమీపంలో రెండు పాయలు కలసి హంద్రీ నదిగా ప్రవహిస్తున్నది. దేవనకొండ, ఆస్పరి, గోనెగండ్ల, కోడుమూరు, కల్లూరు మండలాల్లో ప్రవహిస్తూ.. కర్నూలు నగర శివారులో జోహరాపురం బిడ్జి దిగువన తుంగభద్రలో కలుస్తుంది. నగరం మధ్యలో 5.40 కి.మీలు నది ప్రవహిస్తుంది. వివిధ ప్రాంతాలలో 200 నుంచి 300 మీటర్ల వెడల్పు ఉండాలి. గరిష్ఠ వరద ప్రవాహ అంచుల (మ్యాగ్జిమమ్ ఫ్లడ్ లెవల్-ఎంఎఫ్ఎల్) నుంచి 50 మీటర్ల(150 అడుగులు) వరకు నది గడ్డ వెడల్పు (బఫర్ జోన్) ఉంటుందని జలవనరుల శాఖ ఎఫ్ఆర్ఎల్ డివిజన్ ఇంజనీర్లు తెలిపారు. కోడుమూరు మండలంలో మొదలయ్యే వక్కెరు వాగు కల్లూరు వద్ద హంద్రీలో కలుస్తుంది. నదిలో కలుస్తుంది. నగరం పరిధిలో ఈ వాగు గడ్డ వెడల్పు (బఫర్ జోన్) 30-50 అడుగుల వరకు ఉంటుందని ఇంజనీర్లు తెలిపారు. నగర జనాభా, విస్తీర్ణం పెరగడంతో పాటు భూమి విలువ చుక్కలు తాకడంతో హంద్రీ నది పలు ప్రాంతాల్లో అక్రమణకు గురైంది. రియల్ ఎస్టేటర్లు సైతం నది బఫర్ జోన్‌ను అక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. నది సంరక్షణకు ఆర్ఎస్ఆర్, ఎఫ్ఎంబీ.. వంటి రెవిన్యూ రికార్డుల ఆధారంగా సర్వే చేసి వాటి సహజ స్వరూపం, బఫర్ జోన్ విస్తీర్ణం గుర్తించి సరిహద్దు పిల్లర్లు ఏర్పాటు జలవనరులు శాఖ ఇంజనీర్లు రూ.45 లక్షలతో ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు. సర్వేలు చేయలేదు, సరిహద్దులు గుర్తించలేదు.

రోడ్డు పేరిట నదిని పూడ్చేస్తున్న వైనం

రాజ్‌విహార్ సర్కిల్ దగ్గర అంబేడ్కర్ భవన్ వెనకాల నుంచి ఉస్మానియా కాలేజీ, ఓల్డ్‌టౌన్ - బుధవార పేట బిడ్జి మీదుగా జోహరాపురం వరకు దాదాపు 1.25 కిలో మీటర్లు హంద్రీ నది వెంబడి రోడ్డు నిర్మించాలనే డిమాండ్ చాలా కాలంగా ఉంది. ఈ రోడ్డు నిర్మాణం చేస్తే వడ్డేగేరి, ఓల్డ్‌టౌన్, జమ్మిచెట్టు ఏరియా, జోహరాపురం ప్రాంతాలకు వెళ్లడానికి, అక్కడి నుంచి ప్రజలు రాజ్ విహార్ సర్కిల్‌కు చేరుకొని అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు అనుకూలంగా ఉంటుంది. ఆయా కాలనీ వాసులకు ట్రాఫిక్ సమస్య తీరుతుందని అంటున్నారు. ఈ రోడ్డు నిర్మాణంపై పాలకులకు చిత్తశుద్ధి ఉంటే.. నది వెంబడి ఎన్ని మీటర్లు వెడల్పు, ఎన్ని కిలోమీటర్లు రహదారి నిర్మిస్తున్నారో సర్వే చేయాలి. నది మట్టం నుంచి భూమట్టం వరకు ఎంత ఎత్తులో నిర్మించాలో ఇంజనీరింగ్ నిబంధనలు ప్రకారం డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్) తయారు చేయాలి. అవసరమైన నిధులు ప్రభుత్వం ఇస్తుందా..? నగరపాలక సంస్థ సాధారణ నిధులు నుంచి ఖర్చు చేస్తున్నారా..? కేటాయింపులు చేయాలి. అదే క్రమంలో జలవనరలు శాఖ అనుమతులు తీసుకొని పక్కా ప్రణాళికతో రోడ్డు నిర్మాణం చేయాలని పలువురు కోరుతున్నారు. ఇందుకు విరుద్ధంగా జోహరాపురం డంపింగ్ యార్డులోని చెత్త, మట్టి, నగరంలో పాతభవనాలు కూల్చేసిన మట్టితో నదిని నింపేయడం విమర్శలకు తావిస్తుంది. ఇలా మట్టితో నింపేసి.. దానిపైనే రహదారి నిర్మిస్తే.. భవిష్యత్తులో భారీ వరదలొస్తే రోడ్డు కుంగిపోయి, ఆ సమయంలో రోడ్డుపై సాగిపోయే వాహనదారుల ప్రాణాలకే ప్రమాదం పొంచిఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే.. హంద్రీలో రోడ్డు నిర్మాణంపై జలవనరుల శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవని ఆ శాఖ ఇంజనీర్లు పేర్కొంటున్నారు.





ఇలా చేస్తే..

నగరం మధ్యలోంచి ప్రవహిస్తున్న హంద్రీ నది తుంగభద్ర నదిలో కలిసే ప్రాంతంలో చెక్ డ్యాం లేదా కాజ్‌వే కమ్ బిడ్జి నిర్మాణం చేయాలి. నది ఇరువైపుల ఆక్రమణలు తొలగించాలి. జోహరాపురం నుంచి ఆనంద్ థియేటర్ వరకు (కేసీ కెనాల్) హంద్రీ ఇరువైపుల రోడ్డు నిర్మాణం చేయాలి. నదిని ప్రక్షాళనం చేసి అనునిత్యం నీటి నిల్వ ఉండేలా చేస్తే.. హైదరాబాద్‌లోని ఉసేన్‌సాగర్ ట్యాంక్ బండ్ తరహాలో పర్యాటకంగా అభివృద్ధి చేసే అకాశం ఉంది. అదే జరిగితే నగరం మధ్యలో జలపాతంలా హంద్రీ అందాలు నగర వాసులను కనువిందు చేస్తాయి. అదే క్రమంలో పలువురికి ఉపాధి కూడా లభిస్తుంది. తాత్కాలిక మట్టితో హంద్రీని అడ్డదిడ్డంగా పూడ్చేయడం కాకుండా పక్కా ప్రణాళికతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డు నిర్మాణం చేపడుతున్నాం



హంద్రీ నది ఒడ్డున రాజ్‌విహార్ నుంచి జోహరాపురం వరకు రోడ్డు నిర్మాణం చేయాలనే ప్రతిపాదనం ఉంది. స్వచ్ఛాంధ్రలో భాగంగా జోహరాపురం డంపింగ్ యార్డు అభివృద్ధి చేస్తున్నారు. ఆ మట్టితో రోడ్డు నిర్మాణం చేపట్టాం. నగరపాలక సంస్థ ఆమోదం తరువాత పక్కా రోడ్డు నిర్మాణం చేపడతాం. అదే క్రమంలో హంద్రీపై చెక్ డ్యాం నిర్మించి.. ఇరువైపుల రోడ్డు నిర్మించడం ద్వారా పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం.

- రాజశేఖర్, ఎస్ఈ, కార్పొరేషన్, కర్నూలు

అర్జీలను పోర్టల్‌లో నమోదు చేయండి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను వెంటనే పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోర్టల్‌లో రిజిస్టర్ చేయమని చెప్పినప్పటికీ, ఇంకా కొన్ని మండలాల్లో నమోదు చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీలను నాణ్యతగా, అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని అన్నారు. అర్జీలను క్లోజ్ చేసేటప్పుడు వ్యక్తిగతంగా అర్జీదారులతో మాట్లాడి, అర్జీలకు పరిష్కారం ఇవ్వాలన్నారు. హెచ్‌వోడీలు, ఆర్‌డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు సీఎంవో ఫిర్యాదుల విషయంలో కూడా పౌరులను సంప్రదించకుండా ఫిర్యాదులను పరిష్కరిస్తున్నట్లు గుర్తించామని అన్నారు. సీఎంవో గ్రీవెన్స్‌కి సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 18, పత్తికొండ ఆర్డీవో వద్ద 14, కర్నూలు ఆర్డీవో వద్ద 16, ఏడీ సర్వే వద్ద 2, పోలీసు శాఖలో 2, దేవదాయ శాఖ, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డీపీవో, కర్నూలు డీఎస్పీ, ఏపీఎంఎస్ఐడీసీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఏపీఐఐసీ జెడ్ఎంలో వద్ద ఒక్కొక్క అర్జీ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని గడువులోపు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో అర్జీలను గడువులోపు త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో సి. వెంకటనారాయణమ్మ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఇంటర్ పరీక్షకు 349 మంది గైర్హాజర్

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలకు సోమవారం 349 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో గురువయ్య శెట్టి తెలిపారు. జిల్లాలో ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు 18,481 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 18,132 మంది పరీక్షకు హాజరు కాగా, ఇందులో 349 మంది గైర్హాజరయ్యారని అన్నారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదన్నారు. పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో ఎస్వీఎస్ గురువయ్యశెట్టి, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జీ. లాలెప్ప, డీఈసీ కమిటీ సభ్యులు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలకు 1342 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. 1179 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 163 మంది గైర్హాజరైనట్లు డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. జిల్లాలో మొత్తం 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఐదు సిట్టింగ్ స్క్వాడ్, రెండు ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు పర్యవేక్షించినట్లు తెలిపారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదని వివరించారు.

122 ఫిర్యాదులు


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో 122 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ నేరుగా స్వీకరించారు. హైదరాబాదులో బిందు కన్సల్టెన్సీ పేరుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ.60వేలు తీసుకుని అశ్విని, సాయికృష్ణ, హిమబిందు కలిసి మోసం చేశారని కర్నూలు లక్ష్మీపురానికి చెందిన రమేష్ కుమార్ రెడ్డి ఫిర్యాదు చేశారు. డబ్బులు తీసుకుని ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయడం లేదని కర్నూలు చిదంబరావు వీదికి చెందిన హుశేన్‌సాబ్ ఫిర్యాదు చేశారు. అదేవిధంగా తుంగభద్ర ఇండస్ట్రీ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ హౌస్ లిమిటెడ్ కర్నూలు, కల్లూరు పరిధిలో కొందరు వ్యక్తులు ఒక ఇంటికి తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి, రిజిస్ట్రేషన్ చేశారని కర్నూలు స్టాంటన్‌పురానికి చెందిన సుజాత ఫిర్యాదు చేశారు. అర్ధరాత్రి దాటిన తర్వాత మా ట్రక్కు వాహనాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు డిజల్ దొంగలిస్తున్నారని కర్నూలు కొత్తపేటకు చెందిన మునావర్‌బాషా ఫిర్యాదు చేశారు. తన పొలంలోకి రస్తాను ఏర్పాటు చేయించి పంటను కాపాడుకునేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతూ దేవనకొండ మండలం తెర్నేకల్లు చెందిన రంగస్వామి ఎస్పీని ఆశ్రయించాడు. వచ్చిన ఫిర్యాదులను చట్టపరిధికి లోబడి పరిష్కరిస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ హుసేన్‌పీరా, సీఐలు పాల్గొన్నారు.

మోహన నారసింహుడు

- అహోబిలంలో శరభ వాహనంపై శ్రీవారి విహారం
- 'ఎగువ'లో వేణుగోపాలస్వామిగా జ్వాలా నృసింహుడు


మోహినీ అలంకరణలో దర్శనమిస్తున్న నరసింహస్వామి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 10(ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీప్రాంతంలోని అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దిగువ అహోబిలంలో సోమవారం ప్రహ్లాదవరదస్వామి మోహిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చాడు. మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ విశేష పూజలు నిర్వహించారు. ఆలయ తిరువీధుల్లో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. నిత్య పూజల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవమూర్తులకు వేద పండితులు పంచామృతాభిషేకం, అర్చన, హారతి నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి మండపంలో కొలువుదీర్చారు.

ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామి పొన్నుచెట్టు వాహనంపై కొలువై భక్తులను అనుగ్రహించాడు. ఉదయం స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి వేణుగోపాలస్వామి అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఆలయ మాడవీధుల్లో వేదపండితులు ఉత్సవం నిర్వహించారు.

నేడు కల్యాణోత్సవం : వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవారి కల్యాణోత్సవం, గరుడ వాహన సేవ మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదస్వామి.. వేణుగోపాలస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

నామినేషన్ దాఖలు చేసిన ఎమ్మెల్సీ బీటీ నాయుడు 6లో

ఇక వారం రోజులే!
- ఒత్తిడి వద్దంటున్న మనసిక నిపుణులు 6లో

సైబర్ కేటుగాళ్లు

- రూ.కోట్లలో అకౌంట్లకు చిల్లులు పెడుతున్న నేరగాళ్లు
- జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలు
- ఉద్యోగులు, వైద్యులు, బడా బాబులు, విద్యావంతులే బాధితులు
- పోలీసులు హెచ్చరిస్తున్నా ప్రజల్లో అవగాహన లేమి
- అప్రమత్తంగా ఉండకపోతే అంతే..

నంద్యాల క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లను పట్టుకోవడం చాలా కష్టం. చివరకు పోలీసులు కూడా ఈ కేటుగాళ్లను పట్టుకోవాలంటే దేశ, విదేశాలకు వెళ్లలేక వ్యయప్రయాసలకు గురవుతూ కేసుల్లో పురోగతిని సాధించలేకపోతున్నారు. బాధితులు తమ అకౌంట్ల నుంచి సొమ్ము జారిపోయాక లబోదిబోమంటూ పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. అవి కేవలం ఎఫ్ఐఆర్‌లకు మాత్రమే పరిమితమవుతున్నాయి. నగదు రికవరీలో ఆశించినస్థాయిలో పురోగతిలేదు. నంద్యాల, కర్నూలు జిల్లాల వ్యాప్తంగా ఇప్పటికే ఎంతోమంది సైబర్ మోసాగాళ్ల వలలో పడి నష్టపోయారు. సైబర్ క్రైంపై పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నప్పటికీ అవన్నీ పెడచెవినపెట్టి డబ్బుకు ఆశపడి సైబర్ గాళ్ల ఉచ్చులో ప్రజలు ఇరుక్కుంటున్న ఘటనలు వెలుగుచూస్తూనే ఉన్నాయి.

నంద్యాల జిల్లాలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. 2023తో పోల్చుకుంటే 2024లో ఆ కేసుల సంఖ్య 90శాతం పెరిగింది. 2023లో 29 సైబర్ క్రైం సంఘటనలు జరగ్గా 2024లో 56 సైబర్ కేసులు నమోదు చేసినట్లు పోలీస్ అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది మూడు నెలల కాలంలో కూడా సైబర్ నేరాల కేసులు జిల్లాలో నమోదవుతున్నాయి. రూ.కోట్లలో నగదు పోగొట్టుకున్నప్పటికీ వాటిలో 10శాతం కూడా రికవరీ కాలేదు. యువత, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ వైద్యులు, ఇంటివద్ద పనిచేసే ప్రైవేట్ సంస్థల ఉద్యోగుల నుంచి సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో రూ.లక్షలు దోచేస్తున్నారు. నకిలీ వేలిముద్రలు, సెల్‌ఫోన్ నంబర్లు, ఓటీపీ, మాయమాటలతో బోల్తా కొట్టిస్తున్నారు. సైబర్‌నేరాల కేసులు పెరిగిపోతుండటంతో వాటిపై పోలీస్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ వాస్తవాలను గ్రహించకుండా విద్యావంతులు, ఉద్యోగులు డబ్బు ఆశకు గురై ఉన్న డబ్బును పోగొట్టుకొని లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయిస్తున్నారు.

హనీ ట్రాప్‌తో రూ.6లక్షలు..

సైబర్ కేటుగాళ్లు మరో అడుగు ముందుకేసి అందమైన యువతులను అడ్డు పెట్టుకుంటున్నారు. స్వీట్ వాయిస్‌తో కాల్స్ చేసే యువతుల ద్వారా హనీట్రాప్ మొదలవుతుంది. ఈ నేపథ్యంలో ఇటీవల నంద్యాల జిల్లా కేంద్రానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి ఓ యువతి ఫేస్‌బుక్‌లో ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపించింది. రిక్వెస్టును స్వీకరించిన రియల్ ఎస్టేట్‌వ్యాపారికి ఆ యువతితో మెసెంజర్‌లో చాటింగ్ మొదలు పెట్టింది. ఫ్రెండ్షిప్ పేరుతో వ్యాపారితో చాటింగ్ చేయడం కొనసాగింది. తన వాట్సాప్ కాల్ చేసేందుకు వ్యాపారి నెంబర్‌ను సెండ్ చేయమని చెప్పింది. వ్యాపారి తన వాట్సాప్ నెంబర్‌ను సెండ్ చేయడంతో వాట్సాప్‌లో న్యూడ్ కాల్ ద్వారా మాట్లాడటం జరిగింది. న్యూడ్ కాల్‌లో మాట్లాడేటప్పుడు ఆ వ్యాపారికి సంబంధించిన వీడియోను రికార్డు చేసి తమకు డబ్బులు పంపాలని లేకపోతే సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వైరల్ చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. సమాజంలో పరువు పోతుందని భావించిన ఆ రియల్ ఎస్టేట్ వ్యాపారి దాదాపు రూ.6లక్షల వరకు సమర్పించుకున్నాడు. ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా చోటుచేసుకున్నాయి.



మిగతా 6లో..



నామినేషన్ దాఖలు చేసిన బీటీ నాయుడు

- సింగిల్ నామినేషన్‌తో ఏకగ్రీవం
- రేపు అధికారిక ప్రకటన

కర్నూలు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానం కోసం టీడీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ బీటీ నాయుడు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. మధ్యాహ్నం 1:29 గంటలకు నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, శాసనమండలి డిప్యూటీ సెక్రెటరీ వనితారాణికి అందజేశారు. ఈ కార్యక్రమానికి ముందుగా ముఖ్య మంత్రి చంద్రబాబును అమరావతి సచివాలయంలో కలసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం హెచ్‌ఆర్‌డీ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మంత్రి కందుల దుర్గేశ్‌తో కలసి శాసనమండలిలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరుకున్నారు. ముందే నిర్ణయించుకున్న శుభ ముహూర్తానికి నామినేషన్ పత్రాలను ఆర్‌ఓకు అందజేశారు. అనంతరం శాసనమండలి బయట కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి అమరావతికి వెళ్లిన బీటీ అభిమానులు, టీడీపీ శ్రేణులు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి ఎమ్మెల్సీ బీటీ నాయుడి కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాయలసీమ ప్రాంతంలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి, సమస్యలపై మండలిలో గళమెత్తాలని యువనేత నారా లోకేశ్ బీటీ నాయుడుకు సూచించారు.

- **ఆపత్కాలంలో అధినేతకు దూతగా అవకాశం ఇచ్చారు**

- బీటీ నాయుడు, ఎమ్మెల్సీ:

వైసీపీ హయాంలో రాక్షసుడైన నాటి సీఎం జగన్ అధినేత చంద్రబాబును అక్రమ కేసులో అరెస్టు చేసి 53 రోజులు రాజమండ్రి జైల్లో పెట్టారు. టీడీపీలో కోటి మంది క్రియాశీల సభ్యులున్నా.. ఆపత్కాలంలో దూతగా పని చేసే అదృష్టం అధినేత నాకు ఇచ్చారు. 53 రోజులు రోజు రెండుసార్లు ములాఖత్ అయ్యే అవకాశం రావడం అదృష్టంగా స్వీకరించాను. అధినేత చంద్రబాబు, యువనేత నారా లోకేశ్ నాకు రెండో పర్యాయం ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నా. మండలిలో ప్రజాగళం వినిపిస్తాను. పార్టీ బలోపేతం కోసం ఏ బాధ్యత అప్పగించినా ఓ సైనికుడిలా పని చేస్తాను.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న బీటీ నాయుడు, పక్కన మంత్రులు నారా లోకేశ్, కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు

ఇక వారం రోజులే!



పెద్దబోదనం ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న పదోతరగతి విద్యార్థులు

- దగ్గర పడుతున్న పది పరీక్షలు
- విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దు
- నిపుణుల సూచనలు

చాగలమర్రి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలకు మిగిలింది ఇక ఆరు రోజులే. ఈనెల 17వ తేదీ నుంచి పరీక్షల నిర్వహణకు అధికారులు ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. ఈ క్రమంలో పదో తరగతి పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ విద్యార్థుల్లో టెన్షన్ మొదలైంది. ఉత్తమ మార్కులు సాధించేందుకు విద్యార్థులు రేయింబవళ్లు చదువుతున్నారు. చాలామంది ర్యాంకులు సాధించాలన్న తపనలో ఒత్తిడితో కూడా చదువును కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పదో తరగతి పరీక్షలపై ఒత్తిడిని తగ్గించుకుని భయాన్ని దూరం చేసుకోవాలని పలువురు నిపుణులు, మానసిక వైద్యులు సూచిస్తున్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యంగా గతేడాది డిసెంబరు 1 నుంచి 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను విద్యా శాఖ అమలు చేస్తోంది. గత ఏడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు పక్కా ప్రణాళిక రూపొందించారు. 2025 మార్చి 17 నుంచి జరిగే పరీక్షలకు నంద్యాల జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి 28,294 మంది విద్యార్థులు ఉన్నారు. బాలికలు 12,085, బాలుర 13,209 మంది విద్యార్థులు చదువుతున్నారు.

గణితంలో 6 అంశాలు చదవండి



గణితంలో కనీస స్థాయి ఉన్న ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత పొందాలంటే వాస్తవ సంఖ్యలు, బహుపదులు, గ్రాస్‌లెక్క, సంచాలియత, పాఠ్యాంశాల్లో ముఖ్యమైన సమస్యలను నేర్చుకోవాలి. రెండు చరరాసులలో వేకి యా సమీకరణాల జతలోని గ్రాఫ్ 8 మార్కులకు ఖచ్చితంగా వస్తుంది. నీరూపక జామితి పాఠ్యంశం నుంచి సెక్షన్ ఫార్ములాకు చెందిన సమస్యలు 4 లేదా 8 మార్కులకు వచ్చే అవకాశం ఉంది. సంఖ్యాక శాస్త్రంలోని మీన్, మోడ్, మీడియన్‌పై తప్పక 8 మార్కుల ప్రశ్న ఉంటుంది. ఈ సూచనలు పాటించి ప్రాక్టిస్ చేస్తే ప్రతి విద్యార్థి గణితంలో సులభంగా ఉత్తీర్ణత పొందుతారు.

- రవీంద్రారెడ్డి, గణిత ఉపాధ్యాయుడు

ఇంగ్లీషులో పట్టు ఉండాలి



ఇంగ్లీషులో ఎడిటింగ్, ప్యాసేజ్, పోయమ్స్, డిస్కరీ స్కిల్స్, క్రియేటివ్ రైటింగ్, రిపోర్టెడ్ స్పీచ్ వంటి అంశాలను చదవాలి. వకాబులరి, గ్రామర్ ఎక్కువగా సాధన చేయాలి. స్కిమ్ పొనేటిక్స్‌ను చదివితే సులువుగా రాయవచ్చు.

- శివశంకర్, ఇంగ్లీషు ఉపాధ్యాయుడు

అక్షర దోషాలు వద్దు



తెలుగులో దోషాలు లేకుండా సమాధానాలు రాస్తే 25 శాతం మార్కులు సులువుగా వస్తాయి. పద్యభాగంలో కవి పరిచయం, గద్యంలో ప్రక్రియలు, లేఖ, కరపత్రం ప్రశ్నావళి, చందస్సులో వృత్త పద్యాలపై ప్రశ్నలు వస్తాయి. మారీచుడు, కైక, విశ్వామిత్రుడు, సుగ్రీవుడు, దశరథుడు వంటి అంశాలతో పాటు రామాయణం, ప్రాశస్త్యం, సీతారామ కల్యాణం, సేతువు నిర్మాణం, సీతాన్వేషణ, వృత్తాంతం, సీతాపహరణం వంటి అంశాలపై పట్టు సాధిస్తే అధిక మార్కులు సొంతం చేసుకోవచ్చు.

- మోహన్‌రాజు, తెలుగు ఉపాధ్యాయుడు

సైబర్ కేటుగాళ్లు

(5వ పేజీ తరువాయి)



మరికొన్ని ఘటనలు పరిశీలిస్తే...

- నంద్యాల జిల్లా కేంద్రంలో ఓ ప్రముఖ వైద్య నిపుణుడు సైబర్ క్రైం కేటుగాళ్ల వలలో చిక్కుకొని రూ.26లక్షలు సొమ్మును అప్పనంగా అప్పగించారు. ఢిల్లీ నుంచి ఉన్నత పోలీస్ అధికారుల మాదిరి నంద్యాలలో ఓ ప్రముఖ డాక్టర్‌కు కాల్ చేసి నీ నంబర్‌పై పలు కేసులు ఉన్నాయని బెదిరించి డిజిటల్ అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ నుంచి రూ.26లక్షలు కాజేశారు. తేరుకున్న డాక్టర్ నంద్యాల టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.
- అలాగే జిల్లా కేంద్రంలోని పేరుగాంచిన వైద్యుడు కూడా ఈ కేటుగాళ్ల ఉచ్చులో ఇరుక్కున్నప్పటికీ చాకచక్యంగా వ్యవహరించి తప్పించుకున్నాడు. వైద్యుడి వాట్సాప్ నెంబర్‌కు సైబర్ నేరగాళ్లు వాట్సాప్ కాల్ చేసి ఈ నెంబర్‌పై ఆర్థిక నేరాలు తదితర కేసులు నమోదయ్యాయని బెదిరించి డిజిటల్ అరెస్ట్ ద్వారా సొమ్మును లాగేసుకొనే ప్రయత్నం చేశారు. రూ.కోటికి పైగా నగదు పంపాలని బెదింపులకు పాల్పడ్డారు. వైద్యుడు తన వాహనంలో ఫోన్ మాట్లాడుతూ ఎస్పీ కార్యాలయానికి చేరుకోవడంతో సైబర్ క్రైం నేరస్తుడు పరిస్థితిని పసిగట్టి కాల్ కట్ చేయడంతో ఆ వైద్యుడు ఊపిరిపీల్చుకున్నాడు.
- ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా ఓ మహిళ తాను ఆర్డర్ చేసిన వస్తువులకు సంబంధించి పేమెంట్ చేయగా ఆ వెబ్‌సైట్ నకిలీది కావడంతో ఆమెకు మరో వ్యక్తి ఆమె బ్యాంక్ ఖాతా వివరాలు అడిగి రూ.50వేలు కాజేశాడు. మరో ఘటనలో ఓ వ్యక్తి ఎంటర్‌ప్రైజెస్ సేవలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నాడు. అతడి క్రెడిట్‌కార్డు వివరాలు పంచుకున్న తర్వాత అతడు భారీగా డబ్బులు పోగొట్టుకున్నాడు.

నకిలీ వేలిముద్రలంటే

ఏఈపీఎస్ (ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టం) విధానం ద్వారా కొన్ని బ్యాంకులు ఔట్‌లెట్ సేవలు తీసుకొచ్చాయి. వీటితో ఆధార్ నంబర్‌ను నమోదు చేసి వేలిముద్ర వేసి డబ్బులు తీసుకోవచ్చు. ఈ ప్రక్రియ నిర్వహించే బ్యాంకులతో అనుసంధానమై కొంత కమీషన్ తీసుకొని నగదు అందిస్తుంటారు. నగదు తీసుకొనే సమయంలో వేలిముద్రలను కేటుగాళ్లు కాపీచేస్తూ వాటి ద్వారా నగదు లాగేస్తున్నారు. కేవలం ఈ ఔట్‌లెట్ల వద్దే కాకుండా ఆధార్‌ను ఉపయోగించే రవాణాశాఖ, రేషన్ డిపోలు, రిజిస్ట్రేషన్లు, మీ సేవ తదితర చోట్ల అందించే వివరాలను కాజేస్తున్నారు. దీనిని అడ్డుకోవాలంటే యాప్‌లోకి వెళ్లి థంబ్ లాక్ వేసుకుంటే సరిపోతుందని నిపుణులు చెబుతున్నారు.

ఓఎల్‌ఎక్స్, ఫేస్‌బుక్, మార్కెట్ ప్లేస్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫారములు, వస్తువులు అమ్మే పేరుతో, ఫేక్ వెబ్‌సైట్లు, యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ షాపింగ్ మోసాలు అధికంగా జరుగుతున్నాయి. క్రెడిట్ కార్డు, డెబిట్‌కార్డుల వివరాలు సేకరించి సైబర్ నేరస్తులు డబ్బులు కాజేస్తున్నారు. వీటితోపాటు ఫేక్‌కాల్స్, మెసేజ్‌ల ద్వారాజరుగుతున్నాయి. బ్యాంక్ అధికారులు,టెలికం కంపెనీ ప్రతినిధులుగా నమ్మించి ఓటీపీలు, పిన్ నంబర్లు సేకరించి మోసాలకు పాల్పడుతున్నారు. వీటితోపాటు లాటరీ తగిలిందని, బహుమతులు వచ్చాయని నమ్మించి డబ్బులు డిపాజిట్

ప్రధానంగా నమోదవుతున్న కేసులు



చేయించడం, కేవైసీ అప్‌డేట్ చేయాలని లేకపోతే బ్యాంక్ ఖాతా బ్లాక్ అవుతుందని నమ్మించడమో లేదా బెదిరించడమో లాంటివి జరుగుతున్నాయి. లోన్‌యాప్‌ల ద్వారా తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని నమ్మించి అధిక వడ్డీలు వసూలు చేయడం, రెండింతల అసలుతోపాటు వడ్డీ కూడా చెల్లించాలంటూ బెదిరిస్తూ ఫొటోలను మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో పెడతామని బెదిరించడం తదితర వాటిద్వారా సైబర్ నేరగాళ్లు రూ.లక్షలు, కోట్లలో నగదు దోచుకుంటున్నారు.

ఫిర్యాదు ఇలా చేయాలి

బాధితులు మోసపోయామని గ్రహించిన వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలి. సిబ్బంది అడిగే వివరాలను పూర్తిగా తెలియజేయాలి. వారిచ్చే ఐడీతో సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలి. సైబర్ క్రైమ్.జీవోవీ.ఇన్ యాప్ లోనూ వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఈలోపు ఏటీఎం, బ్యాంక్ ఖాతాల లావాదేవీలను నిలుపుదల చేయించాలి.

Cyber Crime Helpline Number :


1930

అప్రమత్తత అవసరం

- ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఇతర యాప్‌లను వినియోగిస్తే త్రీ స్టెప్ వెరిఫికేషన్ తప్పనిసరిగా పెట్టుకోవాలి. సులువుగా కాకుండా ఇతరులు గుర్తుపట్టగలిగేలా కాకుండా పాస్‌వర్డ్‌ను ఎంచుకోవాలి.
- ఎవరికీ ఓటీపీలు, ఖాతాల వివరాలు చెప్పకూడదు.
- అపరిచితవ్యక్తులు పంపే మెయిల్స్, సంక్షిప్త సమాచారాలు, లింక్‌లను ఓపెన్‌చేయకూడదు.
- ఉద్యోగులు, కొరియర్లు, ఇతర సేవల పేరుతో వచ్చే ఫోన్‌కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి.
- అవసరం మేరకు మాత్రమే ఆధార్‌తో అనుసంధానమైన వేలి ముద్రలను ఉపయోగించాలి.
- ప్రైవేట్ ఇంటర్‌నెట్ సెంటర్లు, ఇతరుల సెల్ ఫోన్లలో ఖాతాలను సరిచూసుకోవడం మానుకోవాలి.

శంభాజీకి చిత్రనివాళి

నంద్యాల కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ధర్మవీరుడు శంభాజీ మహారాజ్ వర్ధంతి(మార్చి 11) సందర్భంగా ఆయన జీవిత చరిత్రలోని కొన్ని ముఖ్యఘట్టాలను ఒకే చిత్రంలో చిత్రీకరించారు నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్. శంభాజీ బాల్యం నుంచి మరణం వరకు ఉన్న ప్రధాన ఘట్టాలు ఈ చిత్రంలో చూడవచ్చు. ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ కుమారుడే శంభాజీ మహారాజ్ అన్నారు. శివాజీ మరణం తర్వాత శంభాజీ మహారాజ్ 9 సంవత్సరాలు పరిపాలన చేసి 120 యుద్ధాల్లో తమ పరాక్రమం చూపించిన ధీరశాలి అన్నారు. శంభాజీ మహారాజ్ తన తండ్రి ఛత్రపతి శివాజీ మాదిరిగానే మంచి పరిపాలన చేశారన్నారు. ఆయన పాలనలో స్త్రీలకు దక్కిందన్నారు. శంభాజీ క్రమశిక్షణ, బాధ్యత కలిగిన పరిపాలకుడు అన్నారు.



ఒకే చిత్రంలో శంభాజీ చరిత్రలో ప్రధాన ఘట్టాలు

ఆలయం



రాజుల రేడు.. గోరంట్ల మాధవుడు..!

- గోరంట్లలో ప్రాచీన ఆలయం
- పూజలందుకుంటున్న లక్ష్మీమాధవస్వామి
- రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కోడుమూరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భక్తుల కల్పతరువు.. కొలిచినవారి కొంగుబంగారం గోరంట్ల లక్ష్మీమాధవుడు. రాజ పోషకుడైన మాధవుడి వైభవం చూసి తరించాల్సిందే. కర్నూలు జిల్లా కేంద్రం నుంచి 35 కి.మీ, కోడుమూరు మండల కేంద్రానికి 11 కి.మీ దూరంలో గోరంట్ల గ్రామం ఉంది. పూర్వం ఈ ప్రాంతంలో గోరువంకముని తపస్సు చేసి స్వామిని ప్రత్యక్షం చేసుకున్నాడని, ముని కోరిక మేరకు మాధవస్వామి గోరంట్లలో వెలసినట్లు ప్రచారంలో ఉంది. ఇక్కడ వెలసిన లక్ష్మీమాధవస్వామి ఆలయం జిల్లాలోనే ప్రసిద్ధి చెందింది.

ఆలయ చరిత్ర

గోరంట్లలో లక్ష్మీమాధవ స్వామి ఆలయాన్ని క్రీ.శ 1105లో చోళరాజులు నిర్మించినట్లు స్థలపురాణం చెబుతోంది. ఆ తర్వాత తుళువ వంశస్థుడు శ్రీకృష్ణదేవరాయలు ఆలయాన్ని సందర్శించారు. అరవీటి వంశజుడు శ్రీరంగప్పరాజయ్య లక్ష్మీమాధవ స్వామి విగ్రహాన్ని పునఃప్రతిష్టించారు. వెల్దుర్తి, డోన్ మొదలగు చతుసీమలో సుమారు 500లకు పైగా ఎకరాలు పూజా కైంకర్యాలకు ఇచ్చినట్లు శాసనాలు చెబుతున్నాయి. ఈ ఆలయంలో లక్ష్మీదేవి, మాధవ స్వామి, ఆళ్వార్ల విగ్రహాలు ఉన్నాయి. వైష్ణవ సంప్రదాయం ఉన్న ఆలయాల్లో ఆళ్వార్లు తప్పనిసరిగా ఉంటారు. అరవీటి రాజులు ప్రతిష్టించిన విగ్రహం స్థానంలో 1961లో మరోసారి మాధవస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. దాంతో గర్భగుడిలో ఈ రెండు విగ్రహాలు పూజలందుకుంటున్నాయి. మొదటగా ఆరవీటి రాజుల ప్రతిష్టించిన మాధవ విగ్రహం పూజలందుకుంటుంది. ఇక్కడ రెండు ధ్వజస్తంభాలు ఉండడం ఈ ఆలయ ప్రత్యేకత. రాజగోపురం ముందు రాతి, గర్భగుడి ముందు చెక్కతో రూపొందించిన ధ్వజస్తంభాలు నెలకొల్పారు. ఆలయంలో చోళ, యాదవ, అరవీటి వంశస్థుల శాసనాలను చూడవచ్చు. వీటి సారాంశం మద్రాసు తాళపత్ర గ్రంథాలయంలో లభిస్తుంది. స్వామివారి రాజగోపురం ఎంతో సుందరంగా నిర్మించి ఉంది. రాజగోపుర నిర్మాణ శైలి రాజుల కళాపోషణకు నిదర్శనం. స్వామి పాదముద్రలు సమీపంలోని గట్టు మీద ఉన్న ఆనవాలు ఉన్నట్లు భక్తులు నమ్ముతున్నారు. లక్ష్మీమాధవస్వామి ఆలయానికి పూజా కైంకర్యాల నిమిత్తం వందల ఎకరాల భూములు ఉన్నాయి. ఈ ఆలయం దేవదాయశాఖ పరిధిలో ఉంది. దేవదాయ శాఖ పరిధిలో ఉత్సవాలు, భూముల వేలం నిర్వహణ జరుగుతోంది.


11 రోజుల పాటు ఉత్సవాలు

గోరంట్ల లక్ష్మీమాధవుడికి ధనుర్మాసంలో బ్రహ్మముహూర్తంలో పూజలు నిర్వహిస్తారు. ఈ మాసంలో వచ్చే వైకుంఠ ఏకాదశి రోజున భక్తులకు ఉత్తరద్వారం గుండా ప్రవేశం కల్పిస్తారు. ఇదేమాసంలో గోదాదేవి, మాధవస్వామి కల్యాణం జరిపిస్తారు. శ్రావణమాసంలో ఉత్సవమూర్తులను పల్లకిలో కొలువుంచి సమీప గట్టు దగ్గరకు వెళతారు. పాదముద్రలకు పూజలు చేస్తారు. ఆరోజు గ్రామప్రజలంతా అక్కడికి హాజరవుతారు. అలాగే దసరా శరన్నవరాత్రుల్లో లక్ష్మీదేవి అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులచే పూజలందుకుంటారు. పాల్గుణమాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. సుమారు 11 రోజులపాటు వేడుకలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో స్వామిఅమ్మవార్ల కల్యాణం, గరుడోత్సవం, రథోత్సవం ప్రధాన ఘట్టాలు. రథోత్సవం తిలకించేందుకు నలుమూలల నుంచి వచ్చే భక్తులు హంద్రీతీరంలో టెంట్లు వేసుకుని విడిది చేస్తారు. ఈ తిరుణాలలో ఎద్దుల క్రయవిక్రయాలు, వంట, వ్యవసాయసామగ్రి అందుబాటులో ఉంటుంది. గోరంట్ల జాతరను ఈ ప్రాంత ప్రజలు రైతుల తిరుణాలగా పిలుచుకుంటారు.

12 నుంచి మాధవుడి బ్రహ్మోత్సవాలు



ప్రసిద్ధ గోరంట్ల లక్ష్మీమాధవ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈవో గుర్రెడ్డి వెల్లడించారు. 11 రోజులపాటు జరిగే వేడుకల్లో భాగంగా మొదటిరోజున ఉత్సవాలకు అంకురార్పణ, రక్షాబంధనం 13న ధ్వజారోహణం, బేరి పూజ, సింహ వాహనోత్సవం, 14న శేష ఉత్సవం, 15 న హనుమంత వాహనం, 16న అర్ధరాత్రి తర్వాత స్వామి అమ్మవార్ల కల్యాణం, గరుడవాహనం, 17న గజవాహనం, 18న శిబికోత్సవం, 19న రథారోహణం, 20న శ్రీవారి రథోత్సవం, 21న పారువేట, అశ్వవాహనసేవ, 22న హంసవాహనసేవ, చక్రస్నానం, వసంతోత్సవం, రాత్రి కంకణ విసర్జనంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.



పూజలందుకుంటున్న అమ్మవారు





చాంపియన్ ట్రోఫీ సంబరాల్లో అపశ్రుతి

- ఆకతాయిల వల్ల కన్ను కోల్పోయిన పండ్ల వ్యాపారి
- బాధితుడిని పరామర్శించిన ఎన్ఎండీ ఫిరోజ్



బాధితుడిని పరామర్శిస్తున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల హాస్పిటల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): చాంపియన్స్ ట్రోఫీ సంబరాల్లో దొర్లిన అపశ్రుతి వల్ల ఓ పండ్ల వ్యాపారి కంటిచూపు కోల్పోయాడు. ఈ ఘటన నంద్యాల పట్టణంలో ఆదివారం రాత్రి చోటుచే సుకుంది. ఇండియా-న్యూజిలాండ్ మధ్య జరిగిన చాంపియన్స్ ట్రోఫీ తుదిపోరులో ఇండియా జట్టు గెలవడంతో క్రికెట్ క్రీడాభిమానులు పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో సంబరాలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అభిమానులు భారీఎత్తున పేల్చిన బాణాసంచా రవ్వలు అటుగా వెళ్తున్న తోపుడుబండి వ్యాపారి మహబూబ్‌బాషా కంటికి తగలడంతో తీవ్ర గాయమైంది. వెంటనే స్థానికులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని బాలాజీ హాస్పిటల్‌లో చేర్పించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించాక కన్ను తొలగించారు. ఈ సందర్భంగా వైద్యుడు ఓబుల రెడ్డి మాట్లాడుతూ మహబూబ్‌బాషా కన్ను పూర్తిగా ఛిద్రమైందని సర్జరీ ఆలస్యమైతే మరో కంటికి ప్రమాదం ఉన్నందున ఎడమ కంటిని తొలగించామన్నారు. మహబూబ్‌బాషాకు భార్య, కుమార్తె, చెవిటి, మూగ కుమారుడు ఉన్నారు.

బాధితుడి కుటుంబానికి అండగా ఉంటాం : ఫిరోజ్

క్రికెట్ సంబరాల సందర్భంగా బాణాసంచా పేలుళ్లలో కంటికి తీవ్ర గాయమై చూపు కోల్పోయిన మహబూబ్‌బాషా కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. సోమవారం ఆయన బాలాజీ హాస్పిటల్‌కు వెళ్లి బాధితుడిని పరామర్శించారు.

పోసాని కస్టడీ పిటీషన్‌ను తిరస్కరించిన ఆదోని కోర్టు

కర్నూలు లీగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు పోసాని కృష్ణమురళిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఆదోని మూడో పట్టణ పోలీసుల అభ్యర్థనను ఆదోని అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ అపర్ణ సోమవారం తిరస్కరించారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌లను అసభ్యపదజాలంతో దూషించారని ఆదోని జనసేన నాయకుడు మలిశెట్టి రేణువర్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదోని మూడో పట్టణ పోలీసులు పోసాని కృష్ణమురళిపై కేసు పెట్టి అరెస్టు చేసిన విషయం విదితమే. ఈ కేసులో నిందితుడు పోసాని వాడిన బాష చాలా తీవ్రమైనవని, అతనిని మరింత లోతుగా విచారించాల్సి ఉన్నందున పోసానిని మూడు రోజుల పోలీసు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోర్టును కోరారు. అయితే నిందితుడి తరపున న్యాయవాదులు పోలీసుల అభ్యర్థనను వ్యతిరేకించి పోసానిని కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం లేదని వాదించారు. గత వారంలో వీరి వాదోపవాదాలను విన్న కోర్టు తన నిర్ణయాన్ని సోమవారం వెలువరించి నిందితుడు పోసానిని పోలీసు కస్టడీకి ఇవ్వాల్సిన అవసరం లేదని ఆదేశాలను జారీ చేసింది. కాగా పోసాని కృష్ణమురళికి బెయిల్ మంజూరు చేయాలని నిందితుల తరపున న్యాయవాదులు గతంలో దాఖలు చేసిన బెయిల్ పిటీషన్‌పై సోమవారం ప్రాసిక్యూషన్ తన అభ్యంతరాలను రాతపూర్వకంగా కోర్టులో దాఖలు చేశారు. ఈ బెయిల్ పిటీషన్‌పై కోర్టు తన తీర్పును ఇంకా వెలువరించాల్సి ఉందని నిందితుల తరపు న్యాయవాది పి. సువర్ణ రెడ్డి తెలిపారు.

చోరీ చేసిన సొమ్మును ఇంటి వద్దే పడేసిన దొంగలు

మంత్రాలయం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరాజనహల్లి గ్రామంలో మార్చి 5న జరిగిన చోరీలో అపహరణకు గురైన సొమ్ము లభ్యమైంది. చోరీకి గురైన సొమ్మును గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి తన ఇంటి వాకిలి వద్ద పడేసి వెళ్లారని బాధితురాలు బోయ లక్ష్మి తెలిపింది. ఈ విషయం ఆమె పోలీసు లకు తెలియజేసింది. మంత్రాలయం సీఐ రామాంజులు, క్లూజ్ టీమ్‌తో వేలిముద్రలు సేకరించి దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో బాధితురాలికి సంబంధించిన రూ.75వేల నగదు, నగలు ప్లాస్టిక్ కవరులో ఇంటి ముందు పెట్టి వెళ్లారు. లక్ష్మి తెల్లారిన తర్వాత చూస్తే ఇంటి ముందు కవర్ కనిపించి పోలీసులకు సమ చారం ఇచ్చింది. సీఐ రామాంజులు పోలీసులతో సంఘటనా స్థలానికి వెళ్లి రికవరీ అయిన సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. మాధవరం ఎస్ఐ సెలవుల్లో ఉన్నారని, ఆయన రాగానే పోలీసు ఉన్నతాధికా రులతో మాట్లాడి బాధితురాలికి సొమ్మును అప్పగించేం దుకు చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.



సొమ్మును చూపుతున్న బాధితురాలు

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

ఆస్పరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైరుప్పల-కలపరి గ్రామాల మధ్య ఆటో బోల్తాపడి పందికోన గ్రామానికి చెందిన పందుల జాలరాజు (39) మృతి చెందినట్లు సీఐ మసాన్ వలి తెలిపారు. వివరాల మేరకు.. కల్లపరి గ్రామంలో ఉరుసు ముగించుకొని తిరిగి తన సొంత ఆటోలో స్వగ్రామానికి వెళ్తుండగా బోల్తా పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండకు తరలించారు. మృతుడికి భార్య సరోజ ఇద్దరు కూతురులు, ఒక కొడుకు ఉన్నారని సీఐ తెలిపార

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు..

పాములపాడు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాళ్ళ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడటంతో జస్వంత్ (17) అనే యువకుడు అక్కడిక క్కడే మృతి చెందాడు. సోమవారం లింగాల గ్రామానికి చెందిన ట్రాక్టర్ రాళ్ళలోడుతో వెళ్తుండగా పాములపాడు చెలిమిళ్ళ గ్రామాల మధ్యగల ఎద్దులవంక వాగు సమీపంలో బోల్తా పడింది. ట్రాక్టర్‌పై ఉన్న లింగాల గ్రామానికి చెందిన ఓబులేసు కుమారుడు జస్వంత్ మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పంట దిగుబడులపై వర్క్‌షాపు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులను తట్టుకుని దిగుబడులను సాధించేందుకు ఎమ్మిగనూరులోని బనవాసిలో మంగళవారం వర్క్‌షాపును నిర్వహిస్తున్నామని నాబార్డు ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని కార్యాలయంలో మాట్లాడుతూ కేవీకే శాస్త్రవేత్తలు ఈ వర్క్‌షాపులో రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల ఎన్జీవో ప్రతినిధులు ఎస్‌పీవో సభ్యులు వాటర్‌షెడ్, టీడీఎఫ్ ప్రాజెక్టు ఏరియాలోని రైతులు పాల్గొంటారని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు కేవీకే, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు ప్రధాన సలహాదారులుగా పాల్గొని వాతావరణ మార్పులు తట్టుకునే కొత్త వంగడాల గురించి పంటల రక్షణ కోసం తగిన సలహాలు, సూచనలు రైతులకు తెలియజేస్తారని నాబార్డు ఏజీఎం సుబ్బారెడ్డి తెలిపారు.

నాగార్జున వర్శిటీ బీఈడీ పేపర్ లీకేజీ ప్రకంపనలు

- జిల్లాలోని బీఈడీ కళాశాలల యాజమాన్యాల్లో అలజడి
- కళాశాలలకు ఒరిస్సా ఏజెంట్ల లింకులపై ఆరా..!
- రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అక్రమాలపై నివేదిక కోరిన మంత్రి లోకేష్
- నివేదిక కోరిన మాట వాస్తవమే: ఆర్‌యూ వీసీ



కర్నూలు అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నాగార్జున యూనివర్సిటీలో బీఈడీ సెమిస్టర్ లీకేజీ వ్యవహారంపై జిల్లాలోని బీఈడీ కళాశాల యాజమా న్యాల్లో గుబులు రేపుతోంది. బీఈడీ మొదటి సెమిస్టర్ పేపర్‌ను బీఈడీ కళాశాలల యాజమాన్యాలు, ఒరిస్సా ఏజెంట్లు కలిపి లీకేజీ చేశారనే వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పోలీసులు సైతం ఒరిస్సా ఏజెంట్లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. విద్యాశాఖ మంత్రి ఈ విష యాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కళాశాలల్లో జరుగుతున్న పనితీరు, అవినీతి, అక్రమాలపై నివేదిక ఇవ్వాలని ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు మంత్రి లోకేష్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఆదేశాల మేరకు రాయలసీమ యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న బీఈడీ కళాశాలల్లో ఒక్కసారిగా అలజడి నెలకొంది. అరెస్టు అయిన ముగ్గురు ఒరిస్సా ఏజెంట్ల విద్యార్థులు జిల్లాలోని కొన్ని కళాశాల్లో ఉండడటం యాజమాన్యాల్లో గుబులు రేపుతోంది. సదరు బీఈడీ కళాశాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నడుపుతుండగా, ఉర్దూ అడ్మిషన్లకు అనుమతులు కూడా లేకపో వడంతో సమస్య తమ మెడకు ఏమైనా చుట్టుకుంటుందా? అని ఓ మాజీ ఉపకులపతి ద్వారా సోమవారం ఉన్నత విద్యామండలిలో సమస్యను చక్కది ద్దుకునేందుకు యాజమాన్యాలు అపసోపాలుపడు తున్నట్లు కొందరు ప్రొఫెసర్లు చర్చించుకుంటున్నారు. సొంత భవనాలు లేకపోగా విద్యార్థులు కళాశాలలకు రాకపోయినా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చూసిచూడనట్లు పూర్తిచేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

2024-25 బీఈడీ అఫ్లియేషన్ వరకు సీడీసీలోని ఒక కింది స్థాయి ఉద్యోగి పెద్ద మొత్తంలో ముడుపులు ఇచ్చారని విద్యార్థి సంఘాల ఆరోపిస్తున్నాయి. జిల్లాలలోని ఏ ఒక్క కళాశాలకు ఉర్దూ అడ్మిషన్స్‌కు అనుమతి లేకున్నా వర్శిటీ అధికారులు విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చారనే ఫిర్యాదులు ఇటీవల ఉన్నత విద్యామండలి చైర్మన్, రాష్ట్ర గవర్నర్‌కు కొందరు ఫిర్యాదు చేశారు.

నంద్యాల జిల్లాలో ఉన్న కొన్ని బీఈడీ కళాశాలల పరీక్షా సెంటర్‌లను వర్శిటీలో ఒక అధికారి ముడుపులు తీసుకుని కర్నూలులో వేయించారని ఇటీవల ఉపకులపతికి ఓ విద్యార్థి సంఘం ఫిర్యాదు చేసింది. ఇలా విద్యాశాఖ మంత్రి కోరిన నివేదికలో ఈ అక్రమాలు బయటకు వస్తాయని బీఈడీ కళాశాలల యాజమాన్యాలలో అలజడి నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కళాశాలల్లో జరుగుతున్న క్రమంలో రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహణ ప్రక్రియతో పాటు పరీక్షలు, తరగతుల జరుగుతున్న విధానంపై నివేదిక కోరారు. అందుకు తగ్గట్టుగా నివేదికలు పంపుతామని ఉపకులపతి డాక్టర్ వెంకట బసవరావు తెలిపారు.

ఆస్తి కోసం తల్లిని కడతేర్చిన కొడుకు

- రోకలి బండతో చంపిన వైనం





వృద్ధురాలు పుల్లమ్మ మృత దేహం, విచారణ చేస్తున్న సీఐ మురళీధర్‌రెడ్డి

ఉయ్యాలవాడ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో ఉన్న తల్లిని కంటి పాపలా చూసుకోవాల్సిన కొడుకు ఆస్తి కోసం మద్యం మత్తులో కడతేర్చాడు. ఈ ఘటన నంద్యాల జిల్లా ఉయ్యాలవాడలో జరిగింది. సోమవారం తెల్లవారు జామున వృద్ధురాలు అంబటి చిన్న పుల్లమ్మ(75)ను ఆమె కొడుకు బాలగురప్ప రోకలి బండతో కొట్టి హత్య చేయడం స్థానికంగా కలకలం రేపింది. పుల్లమ్మకు కుమారుడు, కుమార్తె మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. ఆమె చుట్టు పక్కల గ్రామాల్లో సున్నం అమ్ముకుంటూ జీవిస్తోంది. కుమారుడు బాల గురప్ప మద్యానికి బానిసై డబ్బు కోసం తల్లిని, భార్యను వేధించేవాడు. దీంతో అతని భార్య 10 ఏళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లి పోయింది. అప్పటి నుంచి బాలగురప్ప మద్యం తాగుతూ బయట తిరిగేవాడు. అప్పుడ ప్పుడూ తల్లి దగ్గరకు వచ్చి డబ్బు కోసం వేధిస్తూ ఉండేవాడు. ఇటీవల వృద్ధురాలు తన ఇంటిని మనవడు శివశంకర్ పేరు మీద రాయించింది. దాన్ని జీర్ణించుకోలేక ఆస్తిని తన పేరుమీద రాయించాలని గొడవపడేవాడు. సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో వృద్ధురాలు వంట చేస్తుండగా డబ్బులు ఇవ్వాలని అడిగితే తల్లి ఇవ్వలేదు. దాంతో గురప్ప పక్కనే ఉన్న రోకలిబండ తీసుకొని తలపై బలంగా కొట్టటంతో వృద్ధురాలు అక్కడికక్కడే నేల వాలింది.

ఇంటి చుట్టు పక్కలవారు, బంధువులు గమనించి ఆమెను ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. వృద్ధురాలి అల్లుడు షేగు రమణయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. ఆళ్లగడ్డ సీఐ మురళీధర్‌రెడ్డి విచారణ చేపట్టారు. నంద్యాల నుంచి క్లూజ్‌టీమ్‌ను రప్పించి రక్తపు మరకలు, వేలిముద్రలను సేకరించారు. స్థానికులు నిందితుడ్ని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

- పోస్టర్లను ఆవిష్కరించిన కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

కర్నూలు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పీ-4 విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా తీసుకుందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా పైనున్న కుటుంబాల సామాజిక బాధ్యతగా అట్టడుగునున్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా భాగస్వాములను చేయడం పీ-4 విధానమన్నారు. దీనిపై ప్రజల సూచనలను కూడా తీసుకోవడం జరుగుతుందన్నారు. మార్చి 9 నుంచి 25 వరకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి Https://swarnandhra.ap.gov.in/p4 లింక్ ద్వారా అభిప్రాయాలు తెలియజేస్తే వారి సలహాలను ప్రశంసిస్తూ ఒక ప్రశంసాపత్రాన్ని కూడా అందజేస్తామన్నారు. పీ-4 విధానం కాన్సెప్ట్‌ను తెలియజేస్తూ మారథాన్ కార్యక్రమాలను నిర్వహించడం విశ్వవిద్యాలయాలు, కళాశాలలో అవగాహన పీ4 కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలి రావాలి

- కో ఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు



మాట్లాడుతున్న చింతా సురేష్‌బాబు

కర్నూలు కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ పన్నెండో ఆవిర్భావ సభను ఈనెల 14న పిఠాపురంలో నిర్వహించబోతున్న సందర్భంగా కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి భారీ ఎత్తున జన సైనికులు తరలి రావాలని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ కోఆర్డినేటర్ చింతా సురేష్‌బాబు పిలుపునిచ్చారు. కర్నూలు నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోని జనసేన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సురేష్‌బాబు మాట్లాడుతూ జనసేన పార్టీ ఆవిర్భావ సభ పిఠాపురంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు దూసుకుపోతోందని, ప్రజలు గమనిస్తు న్నారని అన్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది వైసీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డుపై, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై వ్యక్తిగతగా దూషిస్తూ మాట్లాడిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని, వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హెచ్చరించారు. వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పవన్ కల్యాణ్ స్థాయి గురించి మాట్లాడటం సరికాదన్నారు. అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై మాట్లాడాలని, లేదంటే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలని అన్నారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ తోళ్ల మంజునాథ్, జనసేన పార్టీ నాయకులు పీబీవీ సుబ్బయ్య, వై. బజారి, షబ్బీర్, సతీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీపీ నాయకుడిపై దాడి..

- అనుమతి లేకుండా పొలంలో ఎలా పనిచేస్తారని ప్రశ్నించినందుకే..!



బాధితులను పరామర్శిస్తున్న ఉమాపతి నాయుడు

ఆదోని రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఐ టీడీపీ మండల అధ్యక్షుడు గణేకల్లు విరుపాక్షిపై అదే గ్రామానికి చెందిన ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరినవారు దాడికి పాల్పడ్డారు. బాధితుడు తెలిపిన మేరకు.. తన అన్న చిన్న బంగారయ్య పొలంలో అనుమతి లేకుండానే సోమవారం ఉదయం ఉపాధి పనులు చేస్తున్నారు. దీంతో తాను తన అనుమతి లేకుండా ఎలా పనిచేస్తారని సవారి, మల్లేష్, మల్లయ్యతో పాటు మరికొందరిని ప్రశ్నించారు. తాను ఇలా ప్రశ్నించడాన్ని మనసులో పెట్టుకుని రాత్రి తనపై, తన అన్నపై కారం చల్లి కట్టెలతో దాడి చేశారు. చుట్టు ప్రక్కల వారు గమనించి విడిపించారు. దాడి చేసిన వారంతా మహిళా నాయకురాలి అనే ఆరోపించారు. గ్రామస్థులు తమను ఆదోని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు, మారుతి నాయుడు, వెంకటేష్ చౌదరి, తిమ్మప్ప, లక్ష్మీ నారాయణ, తదితరులు ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. భయపడొద్దని తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ విషయంపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం ఎస్.ఐ మహేష్ కుమార్ తెలిపారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఆదోని రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నిషేధిత గంజాయి సాగు చేస్తూ, ప్రయాణికుల ద్వారా ఏళ్ల తరబడి కర్ణాటకకు తరలిస్తున్న వైసీపీకి చెందిన ఇద్దరి వ్యక్తులను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కర్ణాటకలో ఒక వ్యక్తి గంజాయిని విక్రయిస్తుండగా, అక్కడ పోలీసులు అదుపులో తీసుకోవడంతో ఆదోని మండలం పెద్దహరివాణం కేంద్రంగా గంజాయి దందా బట్టబయలైంది. దీంతో ఆదోని రూరల్ పోలీసులు రంగప్రవేశం చేసి గంజాయి సాగు చేస్తున్న పెద్దహరివాణం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు కోటేకల్లు అయ్యన్న, మల్లికార్జునను అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన కోటేకల్లు అయ్యన్నకు గజ్జెహళ్ళి రహదారిలో మూడెకరాల పొలం ఉంది. ఆ పొలంలో అయ్యన్నతోపాటు మల్లికార్జున ఏళ్ల తరబడి గంజాయిని సాగు చేసి, గిఫ్ట్ బాక్సుల్లో పెట్టి పెద్దహరివాణం నుంచి కర్ణాటకకు రాకపోకలు చేసే ప్రయాణికులు, విద్యార్థుల ద్వారా కర్ణాటక రాష్ట్రం శిరుగుప్పకు తరలిస్తున్నారు.

వెలుగులోకి ఇలా..

20 రోజుల క్రితం మల్లికార్జున సమీప బంధువు శిరుగుప్పలో గంజాయిని విక్రయిస్తుండగా, అక్కడ పోలీసులు అదుపులో తీసుకున్నారు. కర్ణాటక పోలీసుల విచారణలో గంజాయి సాగుతో పాటు విక్రయమంతా ఆంధ్రలోని ఆదోని మండలం పెద్దహరి వాణం నుంచే జరుగుతోందని తేల్చి, ఆంధ్ర పోలీసులకు సమాచారం అందజేశారు.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌స్పే ఎస్.ఐ నాగేంద్ర, అగ్రికల్చర్ అధికారి ఆశోక్ కుమార్‌రెడ్డి, సిఎస్‌డిటి వలిబాషా సిబ్బందితో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. అయ్యన్న, మల్లికార్జున సాగు చేస్తున్న మిరప పొలంలోని గంజాయి మొక్కలను, వారి ఇళ్లలో ఉన్న కేజీ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇద్దరిపై కేసు నమోదు చేసి కర్నూలు కోర్టుకు తరలించినట్లు ఎస్.ఐ తెలిపారు.

జీవో 77ని రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని ఏఐఎస్ఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విశ్వ విద్యాలయాల్లో కామన్ పీజీ ఎంట్రెన్స్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏ యూని వర్సిటీకి సంబంధించిన ప్రవేశ పరీక్ష నిర్వహించేలా ఆ వర్సిటీలకు అధికా రాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సోమన్న, షాబీర్ బాషా, జిల్లా సహాయ కార్యదర్శి శరత్, మార్క్స్ అభి, అక్షర పాల్గొన్నారు.

రమణీయం.. యాగంటీశ్వరుడి రథోత్సవం

ఓర్వకల్లు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.కొంతల పాడు గ్రామంలో యాగంటీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవా రం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగిస్తూ రథంపైకి చేర్చారు. స్వామి వారికి అర్చకులు ఉరుకుందయ్య ప్రత్యేక పూజలు చేశారు. రథాన్ని ఆలయం ముందు నుంచి గ్రామం వరకు లాగి యథా స్థానంలో నిలిపారు. కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్ రెడ్డి, సీఐ చల్లని దొర, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, చంద్రసేనారెడ్డి, పుల్లయ్య, పురుషోత్తం, భక్తులు మల్లికార్జునప్ప, మధుసూదన్‌గౌడు పాల్గొన్నారు. ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సునీల్ కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా సినీ సంగీత విభావరి సోమవారం ప్రారంభమైంది. రేలారేలారే బృందం గంగిరెడ్డి, గోపాల్, అప్పారావు, శాంతికుమార్, వినోద్, రూప, సునీత పాడిన పాటలు భక్తులను అలరించాయి.

యాగంటీశ్వరుడికి మాజీ ఎమ్మెల్యే పూజలు: మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి యాగంటీశ్వర స్వామికి సోమవారం పూజలు చేశారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, జడ్పీటీసీ రంగనాథగౌడు, ఎంపీపీ తిప్పన్న, సర్పంచ్ మధుకేశన్న, నాయకులు నాగతిరుపాలు, మద్దయ్య, రమణా రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో బీసీలకు పెద్ద పీట

కర్నూలు అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బీసీలకు సీఎం చంద్రబాబు నాయుడు పెద్ద పీట వేశారని కుడా చైర్మన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి సోమిశెట్టి, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు బేతం క్రిష్ణుడు, కుంపటి క్రిష్ణలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సోమిశెట్టి మాట్లాడుతూ బీటీ నాయుడుకు మరో సారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకు న్నారు. కార్యక్రమంలో జే తిరుపాలు బాబు, దేవరాజ్, అహ్మద్‌బాషా, ప్రవీణ్, మద్దిలేటి పాల్గొన్నారు.

బీటీ నాయుడికి ఎమ్మెల్సీపై హర్షం

కోడుమూరు రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చట్టసభల్లో వాల్మీకులకు సముచిత గౌరవం కల్పించారని టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎన్టీయూసీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గోరంట్ల తిరుమలనాయుడు, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అమడగుంట్ల వెంకటేశ్వర్లు, దేవస్థాన మాజీ చైర్మన్ కున్నూరు పరమేశ్వరనాయుడు సీనియర్ నాయకులు బంకు గిడ్డయ్య, రాజు, మాదన్న, సుంకన్న మాట్లాడుతూ బీటీ నాయు డికి వరుసగా రెండో పర్యాయం ఎమ్మెల్సీ అవకాశం కల్పించడం సంతోషించదగ్గ విషయమన్నారు.

తాగునీటి పథకాల పరిశీలన

సి.బెళగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బురాన్‌దొడ్డి, పోలకల్లు, సి.బెళగల్ గ్రామాల్లోని తాగునీటి పథకాలను ఎంపీడీవో రాణెమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనెనాయక్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో రాణెమ్మ మాట్లాడుతూ గ్రామాల్లోని బోర్లు, విద్యుత్ మోటార్లకు మరమ్మతులు చేయించాలన్నారు. వీరి వెంట స్థానిక అధికారులు, సర్పంచులు ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కర్నూలు అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఉపకులపతి డాక్టర్ వెంకట బసవరావు అన్నారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీ సెమినార్ హాలులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది నాగలక్ష్మిదేవి, రిజిస్ట్రార్ బోయ విజయకు మార్ నాయుడు. ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి పురస్కారం

కర్నూలు అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు డి.స్వప్నకు నారీ శక్తి పురస్కారానికి ఎంపికైనట్లు క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటే శ్వర్లు తెలిపారు. కళా సౌరభ్ 2025 నారీ శక్తి పురస్కారం అవార్డును అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీజీవీ కళాక్షేత్రం, శ్రీనటరాజ నృత్య కళామందిర్ సంయుక్త నిర్వహణలో శనివారం సివిల్ న్యాయా ధికారి లీలా వెంకట శేషాద్రి చేతులు మీదుగా అందుకున్నారని తెలిపారు.

తిరుమలకు పాదయాత్ర

గూడూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి తిరుమలకు భక్త బృందం పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. సోమవారం గూడూరుకు చెందిన తిరుమల భక్త బృందం స్థానిక స్వయంభు అంజనేయ స్వామి ఆలయం నుంచి కాలినడకన బయలుదేరి వెళ్ళారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ ఎల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గూడూరు నుంచి తిరుమలకు 17వ సారి కాలినడకన వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి శ్రీనివాసులు, దస్తగిరి, టీఎస్ రాజు, శేఖర్, రామయ్య, వెంక టేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంలో పాలుపంచుకోండి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల సభ్యులు భాగస్వాములై ప్రకృతి వ్యవసాయ విస్తరణకు తోడ్పడాలని కలెక్టర్ రంజిత్ బాషా పిలుపునిచ్చారు. ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం- నవసార్వత్రిక సూత్రాలు, ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళా సంఘాలు ఆచరించాల్సిన సప్త సూత్రాలు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో కొండారెడ్డి బురుజు వద్ద నిర్వహించిన హెల్మెట్ ధారణపై ఆటో అనౌన్స్‌మెంటు ర్యాలీని ఎస్పీ విక్రాంత్ పాటిల్ జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో 15 ఆటోలతో హెల్మెట్‌పై ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఒక రోజు ర్యాలీ నిర్వహించేందుకు ఆటో యూనియన్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చిందన్నారు. దాతల సహకారంతో రద్దీ ప్రాంతాలైన బళ్లారి చౌరస్తా, బస్టాండులు వంటి పలు ప్రదేశాలలో 4 అధునాతన డిజిటల్ బ్యాన ర్లను ఏర్పాటు చేశారన్నారు. ఈ డిజిటల్ బ్యా నర్స్ హెల్మెట్‌ధారణ గురించి మద్యం సేవించి వాహనాలు నడపకూ డదనే ట్రాఫిక్ నిబం ధనల గురించి తెలియజేస్తాయన్నారు. అనంతరం దాతలు ప్రేమ్‌రెడ్డి, సత్యనారాయణ, చందన బ్రదర్స్ నాగ మునేశ్వరరావు, శశిధర్ రెడ్డి, నాగర్జున సిమెంటు సీనియర్ మేనేజర్ సాంబశివారెడ్డి, శ్రీశైలం ఆర్ఎంసీ కోటిరెడ్డిలకు ఎస్పీ జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, ఏఆర్ అడిషినల్ ఎస్పీ కృష్ణమో హన్, డీఎస్పీలు బాబు ప్రసాద్, భాస్కర్‌రావు, సీఐలు మన్సూరుద్దీన్, తేజమూర్తి, కేశవ రెడ్డి, అబ్దుల్‌గౌస్, రామయ్య నాయుడు, నాగరాజరావు, గుణశేఖర్‌బాబు, ట్రాఫిక్ పోలీసులు, ఆటో యూనియన్ సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి




సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఉపకులపతి, మహిళలు

కర్నూలు అర్బన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి, ప్రొఫెసర్ వెంకట బసవరావు అన్నారు. సోమవారం ఆర్‌యూలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు పాల్గొన్నారు.

● తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని అఖిల భారత బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. సోమవారం నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో చంద్రికమ్మ పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: సావిత్రిబాయి పూలే పోరాట స్ఫూర్తితో అసమానతలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ పిలుపునిచ్చారు. సోమవారం సీఆర్ భవన్‌లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి భారతి, నాగేంద్రమ్మ, వెంకటేశ్వరమ్మ, సులోచనమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

రూ.25లక్షలతో హరిహర క్షేత్రంలో అభివృద్ధి పనులు: మాజీ ఎంపీ టీజీ



టీజీ వెంకటేశ్‌ను సత్కరిస్తున్న నగర బ్రాహ్మణ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్ బాగ్‌లోని హరిహర క్షేత్రంలో రూ.25 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఇటీవల క్షేత్రంలో నిర్వహించిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు, మహా శివరాత్రి వేడుకలను విజయవంతంగా నిర్వహించిన నేపథ్యంలో ఈ కార్యక్రమాలకు ఆర్థికంగా సహకరించిన టీజీ వెంకటేశ్‌ను సోమవారం ఆల య కమిటీ ప్రతనిధులు, నగర బ్రాహ్మణ సంఘం నాయకులు సత్కరించారు. మౌర్య ఇన్‌లోని టీజీ వెంకటేశ్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హరిహర క్షేత్ర పురోభివృద్ధికి గతంలోనూ తనవంతు సహాయ సహకారాలు అందించామన్నారు. నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, గౌరవాధ్యక్షుడు చెరువు వెంకట దుర్గాప్రసాద్, ముఖ్య సలహాదారు టీవీ రవిచంద్రశర్మ, ఉపాధ్యక్షుడు కంచుగంటల శ్యామసుందర్‌రావు, చల్లా నాగరాజ శర్మ పాల్గొన్నారు.

● హరిహర క్షేత్రంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలు, మహా శివారాత్రి ఉత్సవాల్లో విశేష సేవలందించిన వారికి, దాతలకు ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. దాతలు డాక్టర్ డబ్ల్యూ సీతారాం, న్యాయవాది శ్రీనివాసరావు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, ఇతర ప్రతినిధులు నాగులవరం రాజశేఖర్, సీఎస్ ప్రసాదరావు, మామిళ్లపల్లి రాజేశ్, ఫణి తదితరులకు జ్ఞాపికలు అందజేసి శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.

ఆందోళనను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): చేనేతరంగ కార్మికుల సమస్యలపై ఈనెల 17న చేపడుతున్న ఆందోళనను జయప్రదం చేయాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వర రావు పిలుపునిచ్చారు. సోమవారం సీఆర్ భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బి.మాధవస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత వస్త్ర రంగంపై కేంద్రం విధించిన జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పి.రామ చంద్రయ్య, చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ రామాంజనేయులు, కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్. రవీంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక కార్యా లయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 13 అర్జీలు వచ్చాయి. గౌలిగేరిలో తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతుందని స్థానికుడు నారయ్య, బాబా బృం దావన్‌నగర్‌లో తాగునీరు సక్రమంగా రావడంలేదని స్థానికులు ఎస్వీ. సుబ్బమ్మ, సుబ్బయ్య, స్టాంటాన్‌పురంలోని బైరెడ్డి ఫంక్షన్ హాలు వద్ద రహదారి నుంచి మ్యాప్లీ హోమ్స్ వరకు సీసీ రహదారి నిర్మించాలని విష్ణువర్ధన్‌రెడ్డి కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరా ముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఎస్ఈ రాజశేఖర్, ఎంఈ సత్యనారాయణ, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

సి.బెళగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని మండలంలోని పోలకల్లు, గుండ్రేవుల, ఇనగండ్ల, కంబంధహాల్, బురాన్‌దొడ్డి గ్రామాల్లోని రైతులు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ పురుషోత్తం మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్క రించేందుకు కృషి చేస్తామన్నారు.

ఉపాధి డబ్బులు చెల్లించండి

కర్నూలు రూరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు త్వరగా డబ్బులు చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్నూలు మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పీబీ.హుసేనయ్య, ఈ.తాండ్రపాడు సర్పంచు బాలాపీరాతో కలిసి కేవీ నారాయణ సోమవారం ఈ.తాండ్రపాడు శివారులో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్ళి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా నారాయణ మాట్లాడుతూ దాదాపు రెండున్నర నెలలు కావస్తున్న చేసిన పనులకు డబ్బులు ఇవ్వకపోతే కూలీలు ఏమి తిని బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఈ.తాండ్రపాడు సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల

కోడుమూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతికి సంబంధించిన పోస్టర్‌ను ఎంపీడీవో రాముడు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. పీ4 సర్వే ద్వారా సేకరించిన డేటాపై ఈ నెల 13వరకు ప్రతి పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభలు నిర్వహించాలని, పేదరిక నిర్మూలన కోసం ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించాలని అన్నారు.

వర్షపు నీరును వినియోగించుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రతి వర్షపు బొట్టును ఒడిసి పట్టుకుని వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం న్యూఢిల్లీ నుంచి జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అని జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రంజిత్ బాషా, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డ్వామా పీడీ వెంక టరమణయ్య, ఇరిగేషన్ ఎస్ఈ ద్వారకానాథ్ రెడ్డి, డీడీ గ్రౌండ్ వాటర్ శ్రీనివాసారావు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

కల్లూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలని ఏపీ గ్రామ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ట్రెజరర్ శేషన్న డిమాండ్ చేశారు. సోమవారం కల్లూరు మండలం ఎంపీడీఓకు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శేషన్న మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు పలు సర్వేలలో పాల్గొంటూ సెలవు దినాల్లోనూ విధులు నిర్వహిస్తూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, విజయ్‌కుమార్, చంద్రకళావతి, విశ్వతేజ పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని కండీరవ స్టేడియంలో 45వ జాతీయస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. కర్నూలు జిల్లా మాస్టర్స్ ప్రతిభ చాటి పతకాలు సాధించారు. 60 సంవత్సరాల విభాగంలో 300 మీటర్ల హడిల్స్‌లో బంగారు పతకం, 100 మీటర్ల హడిల్స్‌లో బ్రౌంజ్, 100 మీటర్ల రేస్‌లో సిల్వర్ 4/100 మీటర్లలో రిలేలో సిల్వర్ పతకాన్ని ఖాజా బందేనవాజ్ సాధించారు. అలాగే 70 సంవత్సరాల విభాగంలో పాండురంగారెడ్డి జావెలిన్ త్రోలో బ్రౌంజ్ సాధించారు. విజేతలకు మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్, విద్యావేత్త జి.పుల్లయ్య, మాజీ కార్పొరేటర్ సురేందర్ అభినందించారు.

పేదల సొంతింటి కల నెరవేర్చాలి

కర్నూలు న్యూసిటీ, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ అన్నారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ కలెక్టరేట్‌ను ముట్టడించారు. తమకు ఇళ్ల స్థలాలు చూపించండి అంటూ కలెక్టరేట్ ఎదుట పేదలు బైఠాయించారు. అనంతరం పోలీసులు జోక్యం చేసుకుని డీఆర్‌ఓను పిలిపించి వినతి పత్రం అందజేసి సమస్యను సద్దుమణిగించారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ పాలకులు మారినప్పుడల్లా ఇళ్ల స్థలాల పేరుతో తమ సొంత మార్కును చూపించుకోవడం కోసం ఆరాటపడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యురాలు పి.నిర్మల, ఎండీ ఆనంద్‌బాబు, పీఎస్. రాధాక్రిష్ణ, టి.రాముడు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను ఎడారిగా మార్చేందుకు ప్రయత్నాలు: సీపీఐ

జిల్లాను ఎడారిగా మార్చేందుకు పాలకులు కుట్ర చేస్తున్నారని సీపీఐ నాయకులు విమర్శించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ నగర సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ సీనియర్ నాయకుడు కె.జగన్నాథం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్న బడ్జెట్‌లో పశ్చిమ ప్రాంత ప్రాజెక్టు లకు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మునెప్ప, రామక్రిష్ణారెడ్డి, నాగరాజు, ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

బాలికలను గుర్తించి తీసుకెళ్లండి



ఎస్. అనిత, బీ. మహాలక్ష్మి

కర్నూలు హాస్పిటల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోల్లో ఉన్న బి.మహాలక్ష్మి (14) ఎస్.అనిత (10) బాలికను గుర్తించి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గానీ రుజువులతో వచ్చి ఈ నెల 30వ తేదీలోపు తీసు కెళ్లాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల సోమవారం ఒక ప్రకట నలో తెలిపారు. లేనిచో వీరిని అనాథలుగా ప్రకటిస్తామన్నారు. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (న్యూఢిల్లీ) నిబంధనలతో దత్తత ఇస్తామ న్నారు. బాలికలు కర్నూలులోని పెద్దపాడు బాలసదరంలో విద్యాభ్యాసం చేస్తున్నారని పీడీ తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

గూడూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలనా తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ గ్రామస్థుల నుంచి అర్జీలు స్వీకరించారు.

● గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ రామాంజనేయులు అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ మాట్లాడుతూ చనుగొండ్లలో ఇప్పటి వరకు 3 వేల మూడు వందల ఎకరాల వరకు రీ సర్వే చేశామన్నారు.

ముగిసిన అంతర్రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.కొంతల పాడు గ్రామంలో యాగంటీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా దాతల సహకారంతో నిర్వహించిన అంతర్రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి 25 టీములు పాల్గొన్నాయి. మొదటి విజేతగా ఎన్.కొంతలపాడు, రెండో విజేతగా గోనెగండ్ల, మూడో విజేతగా పచ్చర్ల, నాలుగో విజేతగా వారణాసి, ఐదో విజేతగా శకునాల, ఆరో విజేతగా హరిటర్స్ నిలిచాయి. విజేతలకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, ఈవో చంద్రశేఖర్ రెడ్డి, దాతలు నగదు బహుమతులు అందజేశారు.

యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ

కల్లూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 12న తలపెట్టిన యువత పోరు పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం కల్లూరులోని తన స్వగృహంలో ఆయన వైసీపీ యూత్‌వింగ్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోస్టర్ విడుదల చేశారు. కాటసాని మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులు వారి తల్లిదండ్రుల పడుతున్న సమస్యలపై నంద్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు చేపట్టే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భగవద్గీత పారాయణం చేయాలి

కర్నూలు కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భగవద్గీత పారాయణం చేయాలని నగర గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డీవీ రమణ అన్నారు. సోమవారం నగరంలో సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో సామూహిక సంపూర్ణ భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఎస్‌జీ మహాబలేష్ పాల్గొన్నారు.

రైతులను ఉత్తేజపరిచేందుకే పోటీలు



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మోహన్ రెడ్డి

ఓర్వకల్లు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రైతులను ఉత్తేజ పరిచేందుకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎన్.కొంతలపాడులో యాగంటీశ్వరస్వామి ఉత్సవాల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. విజేతలకు దాతలు కేఎంబీ బ్రదర్స్ రంగన్న, తలారీ ఎల్లప్ప, ఈడిగ వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, లింగన్న, ట్రస్టు బోర్డు సభ్యులు శ్రీనివాసులు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమం లో రైతు సంఘం నాయకులు చంద్రశేఖరప్ప, మల్లికార్జునప్ప, మధుసూదన్‌గౌడు, మల్లయ్య పాల్గొన్నారు.

వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్‌లపై ఆరోపణలు తగవు

రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కర్నూలు కల్చరల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఘటనలో వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్‌లపై ఆరోపణలు తగవని వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి అన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు నగరంలోని హిందూ చైతన్య వేదిక, వివిధ హిందూ ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో రాయచోట ఘటనలో నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేశారు. ఈసందర్భంగా నందిరెడ్డి సాయిరెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయచోటిలో మార్చి 4న జరిగిన వీరభద్రస్వామి పార్వేటి ఉత్సవంలో భక్తులపై అన్యమతస్తులు దాడిచేయగా పోలీసులు వారిని అదుపు చేయ డంలో విఫలమయ్యారని విమర్శించారు. అంతేకాకుండా హిందువులపైనే లాఠీ చార్జి చేసి తీవ్రంగా గాయపరిచి, భక్తులపై కేసులు నమోదు చేయడాన్ని వీహెచ్‌పీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. అనంతరం వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీ సీ మద్దిలేటి, రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడారు. రాయచోటి అర్బన్ ఎస్ఐ జె నరసింహారెడ్డి ప్రవర్తన హిందువులను రెచ్చగొట్టే విధంగా ఉందన్నారు. తక్షణమే ఎస్ఐని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ముఖ్యమంత్రికి రాసిన లేఖను కలెక్టర్ రంజిత్ బాషాను కలిసి అందజేశారు. కార్యక్ర మంలో వీహెచ్‌పీ రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగి భానుప్రకాశ్, నాయ కులు మహేష్, వీపూరి నాగరాజు, నీలి నరసింహ, గోరంట్ల రమణ పాల్గొన్నారు.

గోకులం షెడ్లతో ఊతం

- ఆలూరులో ఇప్పటికే 43 షెడ్ల పూర్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



కాత్రికి గ్రామంలోని గోకులం షెడ్‌లో పశువులు

ఆలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం గోకులం షెడ్లను నిర్మిస్తోంది. వ్యవసాయంలో లాభాలు రాకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా పశుపోషణ వైపు మొగ్గుచూపుతున్నారు. ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులను గుర్తించి షెడ్లను నిర్మించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

మండలంలో ఇప్పటికే 43 షెడ్ల పూర్తి..

ఆలూరు మండలానికి ప్రభుత్వం 53 గోకులం షెడ్లను మంజూరు చేసింది. ఇప్పటికే 43 షెడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, నాయకులు, సర్పంచులు, అధికారులతో కలిసి ఇటీవల ప్రారంభించారు. గతంలో పశువులు ఎండకు ఎండుతూ, వానకు తడిసిపోతుండేవని రైతులు అంటున్నారు. పశువులకు వసతులు లేక చెట్ల కింద కట్టేసేవారని, కూటమి ప్రభుత్వం షెడ్లు నిర్మించడంతో రక్షణ లభించిందని పశువుల యజమానులు చెబుతున్నారు.

బిల్లులు మంజూరు చేయాలి

గోకులం షెడ్ల నిర్మాణానికి రూ.1.50 లక్షలు కేటాయించారు. నిర్మాణాలు కూడా పూర్తిచేసేశారు. అయితే బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారులు కోరారు.

● ఆలూరు ఉపాధి ఏపీవో శ్రీనివాసులును వివరణ కోరగా షెడ్లను పూర్తిచేసి, ఎం.బుక్స్ సిద్ధం చేసి బిల్లులు పెట్టామన్నారు. నిధులు మంజూరు కాగానే లబ్ధిదారులకు డబ్బు జమ అవుతుందన్నారు.

హిందూ భక్తుల మీద కేసులు అన్యాయం

- అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీసులు హిందూ భక్తులపై కేసులు పెట్టడం అన్యాయమని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీలో మాట్లాడారు. ఈ నెల 4న పారువేట ఉత్సవంలో అల్లరి మూకలు భక్తులపై దాడి చేశారన్నారు. రాయచోటి ఎస్.ఐ, ఎస్పీ హిందూ భక్తులే ఆత్యాయత్నానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొనడం అన్యాయమన్నారు



రాయచోటిలో శాంతికి కృషి చేయాలి

ఆదోని టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటిలో శాంతి స్థాపనకు కృషి చేయాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ సూచించారు. సోమవారం మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనపై ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అసెం బ్లీలో ప్రజల మధ్య దూరం పెంచేలా మాట్లాడటం సరికాదన్నారు. నాయకులు ప్రజల మధ్య మంచి వాతావరణ ఏర్పడేలా చూడాలని కోరారు.

బడ్జెట్‌లో జిల్లాకు అన్యాయం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య



ధర్నా చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ఆస్పరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్లో కర్నూలు జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య విమర్శించారు. సోమవారం అంబేద్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లాలోని వేదవతి, గుండ్రేవుల గురు రాఘవేంద్ర ఆర్డీఎస్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని జిల్లా వాసులు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కర్నూలు నగర అభివృద్ధికి నిధులు కేటాయించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో నాగేంద్రయ్య, విరుపాక్షి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసగించిన కూటమి

- రేపు కర్నూలులో యువత పోరు : మాజీ ఎమ్మెల్యే



పోస్టర్లను విడుదల చేస్తున్న సాయి ప్రసాద్ రెడ్డి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులు, విద్యార్థులను మోసగించిన కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం తన నివాసంలో ఈనెల 12న కర్నూలులో తలపెట్టిన యువత పోరు పోస్టర్లను విడుదల చేశారు. మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. చంద్రకాంత్ రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫయాజ్ అహ్మద్, వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు బాలాజీ, రామలింగేశ్వర యాదవ్, రహీం, నల్లారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలి



వెల్దుర్తిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

వెల్దుర్తి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తమకు వేతనాలు పెంచాలని అంగన్వాడీలు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ కార్యదర్శి కృష్ణ మాట్లాడుతూ వేతనాలు పెంచుతామని ఎన్నికల ముందు టీడీపీ హామీ ఇచ్చి, ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. అనంతరం తహసీల్దార్ చంద్రశేఖర వర్మకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు మాధవస్వామి, అంగన్‌వాడీ నాయకులు పాల్గొన్నారు.

'నష్ట పరిహారానికి నివేదికలు'

మద్దికెర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనగ, జొన్న పంట నష్టంపై జిల్లా అధికారులకు నివేదిక పంపినట్లు ఏవో రవి తెలిపారు. సోమవారం మాట్లాడుతూ మండలంలో ఈ ఏడాది 18వేల ఎకరాల్లో శనగ సాగు చేశారని, వెయ్యి ఎకరాల్లో జొన్న సాగు చేశారని, వర్షాభావ పస్థితులతో దిగుబడి రాలేదన్నారు. కరువు మండలంగా ప్రకటించాలని పలువురు కోరిన విషయాన్ని కూడా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఏవో తెలిపారు.

ఉపాధి వేతనాలు ఇవ్వండి

ఆదోని రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెండింగ్ ఉన్న ఉపాధి కూలీల వేతనాలను చెల్లించాలని కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లింగన్న డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెసలబండ, దొడ్డనగేరి, మాంత్రికి సచివాలయాల వద్ద ఉపాధి కూలీలతో కలిసి ఆందోళన చేశారు. ఉపాధి చట్ట ప్రకారం 15రోజుల్లో చెల్లించాల్సిన కూలీల వేతనాలను నెలల తరబడి చెల్లించకపోవడం ఏంటని ప్రశ్నించారు. తక్షణమే కూలీల ఖాతాలో నగదును జమ చేయాలని కోరారు.



పెసలబండలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కూలీలు

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం - పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరచాలని సూచించారు. గడువులోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ సర్వేయర్స్ శ్రీనివాస్‌రాజు, వేణు సూర్య, డీఎల్‌పీవో నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, ఆర్టీసి డిపో మేనేజర్ మహ్మద్ రఫి, డిటీలు గుండాల నాయక్, వలిబాషా పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

గడ్డి వాములు, విద్యుత్ మోటర్ దగ్ధం

క్రిష్ణగిరి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరుకలచెరువు అమకతాడు గ్రామాల్లో సోమవారం అగ్ని ప్రమాదాల్లో గడ్డి వాములు, విద్యుత్ మోటర్, తీగెలు, స్టార్టర్, పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితుల కథనం మేరకు.. ఎరుకలచెరువులో మొలక సుంకన్న కళ్ళందొడ్డిలో ప్రమాద వశాత్తు నిప్పంటుకొంది. జొన్న సొప్ప, వేరుశనగ, వరి గడ్డి వాములు, సామగ్రి, సామాన్లు, పైపులు కాలి బూడిద య్యాయి. డోన్ అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. రూ.2లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. అమకతాడు గ్రామంలో బోదేపాటి హనుమన్నకు చెందిన మోటర్, స్టార్టర్, తీగెలు, పైపులు కాలిపోయాయి. రూ.60 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.



ఎరుకలచెరువులో దగ్ధమవుతున్న గడ్డి వాములు

సమాచారం ఇవ్వకుండా గ్రామసభ ఎలా నిర్వహిస్తారు?



గ్రామ సభలో మాట్లాడుతున్న డీఆర్‌పీ ఏడుకొండలు

మద్దికెర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను తనిఖీ చేసి గ్రామసభ ద్వారా ప్రజలకు వివరించాల్సి ఉంటుంది. అయితే సోమవారం సమాచారం ఇవ్వకుండానే స్థానిక పంచాయతీ కార్యాలయంలో సామాజిక తనిఖీ గ్రామసభను ఏర్పాటు చేసినట్లు కూలీలు ఆరోపిస్తున్నారు. మద్దికెరలో దాదాపు 30 మంది మేటీలు ఉండగా, రోజూ 3వేల మందికి పైగా ఉపాధి పనులకు వెళ్తున్నారు. అయితే సోమవారం సామాజిక తనిఖీ బృందం డీఆర్‌పీ ఏడుకొండలు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో పదిమంది కూడా హాజరుకాలేదు. కాగా సభ ఏర్పాటు చేసినట్లు బయటకు వెళ్లి కొత్తవారితో సంతకాలు చేయించు కున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై ఉపాధి అధికారులు మాట్లాడుతూ మేటీలకు అందరికీ సమాచారం ఇచ్చామని వివరణ ఇచ్చారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

పత్తికొండ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయంబర్స్‌మెంటు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న కలెక్టరేట్ ధర్నా చేయనున్నట్లు వైసీపీ మేధావుల ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీరంగడు, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 3,900 కోట్లు బకాయిలు ఉండగా, బడ్జెట్‌లో కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయకుడదన్నారు. కన్వీనర్ నాగరాజు, ఎంపీపీ నారాయణదాసు, మాజీ సర్పంచ్ జయచం ద్రారెడ్డి, భాస్కర్ నాయక్, గణపతి, ఎంపీటీసీలు నీలకంఠ, కేశవులు, బనగాన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూములను పంపిణీ చేయండి

మద్దికెర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపా, బొమ్మనపల్లి గ్రామాల్లో భూస్వాముల చేతుల్లో ఉన్న మిగులు భూములను పంపిణీ చేయాలని సీపీఐ నాయకులు నబీ రసూల్, కారుమంచి డిమాండ్ చేశారు. సోమవారం బస్టాండు నుంచి ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఏళ్లుగా భూములను పేదలకు పంపిణీ చేయాలని కోరుతున్నా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ హుశేన్‌సాహెబ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు కార్యదర్శి నాగరాజు, కోదండరాముడు, మాధన్న, వీరాంజనేయులు, బొజ్జన్న, తదితరులు ఉన్నారు.

ఉపాధి వేతనాలు చెల్లించాలి

ఆలూరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు 10 వారాలుగా పెండింగ్ ఉన్న వేతనాలను చెల్లించాలని కూలీలు డిమాండ్ చేశారు. సోమవారం ఆలూరు సచివాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్మిక సంఘం జిల్లా నాయకులు హనుమంతు మాట్లాడుతూ కూలీలకు సక్రమంగా వేతనాలు అందడం లేదని కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పథకంలో రాజకీయ జోక్యం ఉండకుండా చూడాలని, అడిగిన వారందరికీ జాబ్ కార్డులు ఇచ్చి పనులు కల్పించాలని కోరారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు అందించాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. నాగరాజు, వీరేష్, మల్లికార్జున, పవన్, మహానంది, ఎం నాగరాజు, ఈరన్న, నాగప్ప పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు, కూలీలు

ఏఐవైఎఫ్ నాయకుడిపై వార్డెన్ల ఫిర్యాదు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా హాస్టల్లోకి ప్రవేశించి, తప్పుడు ప్రచారం చేస్తున్నారని వార్డెన్లు ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు లింగప్పపై సోమవారం ఫిర్యాదు చేశారు. వార్డెన్ల సంఘం ప్రధాన కార్యదర్శి నాగమద్దయ్య, వార్డెన్లు సిద్ధప్ప, కవిత, సుజాత, భారతి, క్రాంతి, ఎండీ అలీ మాట్లాడుతూ ఎస్సీ హాస్టల్-1లో విద్యార్థులు భోజనం సరిగా లేదని చెప్పకున్నా పత్రికలకు తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. తమపై దుర్భాషలా డారని, బ్లాక్ మెయిల్ చేశారని ఆరోపిం చారు. దీనిపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

అభ్యంతరాలను స్వీకరిస్తాం

మద్దికెర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో చేసిన రీసర్వేలో అభ్యంతరాలను స్వీకరిస్తా మని తహసీల్దార్ హుశేన్ సాహెబ్ అన్నారు. సోమవారం వీఆర్వోల సమా వేశంలో మాట్లాడు తూ మండలంలోని బురుజుల, హంపా, బసినేపల్లి, మదనంతపురం బొమ్మనపల్లి గ్రామాల్లో రీసర్వే చేశారని, వీటిపై కొందరు రైతులు అర్జీలు ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పెరవలి గ్రామంలో రీసర్వే చేస్తున్నామనీ, రైతుల అభ్యంతరాలను స్వీకరించి వివరాలు తీసుకుంటామన్నారు. రైతుల ఒప్పందంతోనే వివరాలను నమోదు చేస్తామన్నారు.

నిధులు కేటాయించండి

ఆదోని రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆదోని నియోజకవర్గ అభివృద్ధికి 2వేల కోట్ల నిధులను కేటాయించాలన్నారు. ఎల్లెల్సీ ద్వారా చెరువులకు నీటిని నింపాలని కోరారు. అలాగే మూత పడిన పరిశ్రమలను తెరిపించి, వలసలను నివారించాలన్నారు. కూటమి ప్రభుత్వం 9నెలల పాలన పూర్తయిందని, కానీ ఆదోనిలో కొంచి అభివృద్ధి పనులు చేయలేదన్నారు. వేదవతి, ఆర్డీఎస్ కుడి కాల్వ, గుండ్రేవుల, గురురాఘవేంద్ర ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

రూ.10వేల కోట్లు ఇవ్వాలి

పత్తికొండ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ప్రాజెక్టులకు రూ.10వేల కోట్ల నిధులు కేటాయించాలని సీపీఐ కార్యదర్శి రాజాసాహెబ్ డిమాండ్ చేశారు. సోమవారం సీఆర్ భవన్ నుంచి కార్యకర్తలు నాలుగు స్తంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పధాన రహదారిపై ధర్నాచేశారు. పట్టణ కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

దళితుల భూములను లాక్కోవద్దు



తహసీల్దార్‌కు విన్నవిస్తున్న నాయకులు

ఆలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): దేవుడి పేరుతో దళితుల భూములు లాక్కోవద్దని బీఎస్ఎస్ ప్రెసిడెంట్ రామతీర్థం అమ్రేష్, మాల మహానాడు కార్యదర్శి మాల నరసప్ప కోరారు. సోమవారం తహసీల్దార్ గోవింద్ సింగ్‌కు వినతిపత్రం అందించారు. అనుభవంలో ఉన్న మాదిగలకు హక్కు కల్పించాలన్నారు. ఆంజనేయస్వామి విగ్రహం వద్ద అంగళ్లు ఏర్పాటు చేసిన నరసప్పకు యాజమాన్య హక్కు కల్పించాల న్నారు. మాల మానాడు నాయకు లు గడ్డం హుసేని బీఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బోయ విజయుడు, కొల్లు రామకృష్ణ, బీఎస్ఎస్ వీర మహిళ మల్లమ్మ, నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి రామాంజి, కుమార్, కల్లుకుంట గోవిందమ్మ, బాధిత కుటుంబీకులు జయమ్మ, ఉమా, జ్యోతి పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే నివాళి

పత్తికొండ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పందికోన గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త బాల్‌రాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో బాల్‌రాజు భౌతికకాయానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామార్శించారు. బాధిత కుటుంబానికి వైసీపీ అండగా నిలుస్తుందని ఆమె భరోసా ఇచ్చారు. నాయకులు శ్రీరంగడు, ఎంపీపీ నారాయణదాసు, కన్వీనర్ నాగరాజు, తదితరులు ఉన్నారు.

సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలి

మద్దికెర, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయినులు సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని డిపార్టుమెంటల్ అధికారి కిరణ్మయి అన్నారు. సోమవారం విద్యాసాయి కళాశాలలో సావిత్రీబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. కళాశాల ఎండీ యజ్ఞం వెంకటమాధవ మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధి హక్కుల కోసం కృషి చేసిన తొలితరం ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాల సునీత, ఉపాధ్యాయినులు, తదితరులు ఉన్నారు.


విద్యుత్ కార్యాలయ ఆవరణలో మంటలు

ఆలూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వెనుక సోమవారం మంటలు చెలరేగాయి. అగ్నిమాపకసిబ్బంది మంటలను మం టలను అదుపు చేశారు. చెత్త పేరుకుపోవ డంతో ఎవరో నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగినట్లు సమాచారం. పక్కనే హాస్టల్, సబ్‌స్టేషన్ ఉండటంతో స్థానికులు ఆందోళన చేశారు.

స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఆవోపా ఆధ్వర్యంలో సోమవారం అభయాంజినేయ ఆలయంలో 213 మంది పిల్లలకు స్వర్ణామృత ప్రాసనం మందును పంపిణీ చేశారు. సంస్థ కార్యదర్శి వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ, చిన్న పిల్లలకు రోగనిరోధక శక్తిని పెంచి, రోగాలు దరిచేరకుండా, ఆరోగ్యాన్ని పరిరక్షించే ఈ ఔషధాన్ని 9వ సారి పంపిణీ చేశామన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



వెంకట్రాముడు(ఫైల్)

తుగ్గలి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైతు సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు.. మండలం లోని రాంపల్లి గ్రామానికి చెందిన వెంకట్రాముడు(48) రాంపల్లి-పెండెకల్ ఆర్ఎస్ గ్రామ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకు న్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు .. వెంకట్రాముడుకు ఐదెకరాల పొలం ఉంది. వ్యవసాయంలో నష్టంరావడంతో దాదాపు రూ.20 లక్షల మేర అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న తుగ్గలి ఎస్సై కృష్ణమూర్తి సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలు ఆరా తీశారు. మృతుని భార్య లక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు

బస్సును ఢీ కొన్న ట్రాక్టర్

- ట్రాక్టర్ డ్రైవర్ మృతి
- ఇద్దరికి గాయాలు



హైవేపై బోల్తాపడ్డ ట్రాక్టర్ ట్రాలీ

వెల్దుర్తి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి-44పై సోమవారం ఉదయం తిక్కతాత ఆలయం సమీపంలో ట్రాక్టర్ బస్సును ఢీ కొట్టి, డ్రైవర్ మృతిచెందగా, ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. కర్నూలు మండలం పసుపల నుంచి వెల్దుర్తికి ట్రాక్టర్, అనంతపురానికి వెళుతున్న ఆర్టీసీ బస్సు పక్కపక్కనే వెళుతున్నాయి. ట్రాక్టర్ డ్రైవర్ అకస్మాత్తుగా కుడివైపు తిప్పడంతో బస్సును ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ ఇంజన్ నుంచి ట్రాలీ వేరై రోడ్డుపై బోల్తాపడింది. బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ యశ్వంత్(23) అక్కడికక్కడే మృతిచెందగా, క్లీనర్ సంజీవ(20), బస్సు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు హైవే పెట్రోలింగ్‌కు సమాచారం అందించ డంతో వారు చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో వెల్దుర్తి సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా వాహనాలను తొలగించారు.

ప్రారంభమైన హోలీ సంబరాలు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో హోలీ సంబరాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి కిలిచిన్ పేట అంబా భవాని ఆలయంలో నిర్వాహకులు రంగుల బిందెలతో పురవీధుల్లో ఊరేగించి మన్మథ శివపార్వతి దేవి విగ్రహాలను కొలువుంచారు. 13వ తేదీ రాత్రి 10 గంటల నుంచి మన్మధ రథోత్సవం ఉంటుందని, 14న హోలీ ఉంటుదంనని తెలిపారు.



ధర్నా చేస్తూన్న సీపీఐ నాయకులు

నిధులు కేటాయించాలి

ఆలూరు రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని బీకే ఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాక భూపేశ్, సీపీఐ కార్యదర్శి రామాంజినేయులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. చాపల గోపాల్, రామాంజినేయులు, రాముడు ఉన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

కోసిగి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.పదివేల కోట్ల నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్ అన్నారు. సోమవారం కోసిగిలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ రుద్రగౌడుకు అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కర్నూలు జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని, ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, జిల్లా సమగ్రాభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, డీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు ఓంకార్ స్వామి, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఈరేష్, రైతులు తాయన్న, పరుశురాముడు, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించండి

కోసిగి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): వాల్మీకి, బోయ సామాజిక వర్గానికి చెందిన బీటీ నాయుడుకు రెండోసారి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు, న్యాయవాది బి.వీరేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం మంత్రి లోకేశ్ చాంబరులో ఎమ్మెల్సీ బీటీనాయుడుతో కలిసి టీడీపీ లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు బి.వీరేష్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్రంలోని వాల్మీకుల సమస్యలను వారికి వివరించినట్లు తెలిపారు.

టీడీపీలోనే బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట

పెద్దకడుబూరు మార్చి 10(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేసిందని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు కోడిగుడ్ల ఏసేపు అన్నారు. సోమవారం ఆయన పెద్దకడుబూరులో విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా రెండోసారి బీటీ నాయుడును ప్రకటించడంపై సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థి బీటీ నాయుడుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

కోసిగి: తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు పెద్ద పీట వేశారని, బీసీ సామాజికవర్గానికి చెందిన బీటీ నాయుడును రెండోసారి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడం హర్షణీయమని టీడీపీ కోసిగి మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీలో బడుగు, బలహీనవర్గాలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడుకు, విద్య ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. పార్టీని నమ్ముకున్న వారికి న్యాయం చేసేది టీడీపీనే అన్నారు.

రజక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న గురుశేఖర్

గోనెగండ్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రజకుల అభివృద్ధి కోసం ప్రభుత్వం రజక కార్పొరేషన్‌కు రూ. వేయి కోట్లు కేటాయించాలని రజకవృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి గురుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం గోనెగండ్లలో రజక వృత్తిదారుల సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సంఘం సీనియర్ నాయకుడు శివరాముడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకులకు బీసీ కార్పొరేషన్ ద్వారా సొసైటీలు ఏర్పాటు చేసి రుణాలు ఇవ్వాలని , ఆదే విధంగా ప్రతి గ్రామానికి దోబీ ఘాట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ నెల 22 న కోడుమూరులో జరిగే మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో శ్రీనివాసులు, శేఖర్, ఉరుకుంద, రాజేష్, వెంకటేశ్వర్లు, మధు, నరసింహులు, వాసు, నరసన్న పాల్గొన్నారు.

నూతన మండల కమిటీ ఏర్పాటు: గోనెగండ్ల మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కులుమాల నరసింహుడు, అధ్యక్షుడిగా శివరాముడు, ఉపాధ్యక్షులుగా వాసు, శేఖర్, రాజేష్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి గా నరసింహులు, మధు, నరసన్నలతో పాటు కార్యవర్గ సభ్యులుగా మరో 15 మందిని ఎన్నుకున్నారు.

నిజ బృందావనాన్ని దర్శించుకున్న భక్తులు

మంత్రాలయం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకున్నారు. సోమవారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయకొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం నిర్వహించి మూలరాములకు పూజలు చేసి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులకు స్తప్త ముద్రధారణ చేశారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనాన్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఎద్దుకు అంత్యక్రియలు

కోసిగి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మృతి చెందిన ఎద్దుకు అంత్యక్రియలు నిర్వహించి దానిపై ఉన్న ప్రేమను చాటుకున్నాడు ఓ రైతు. సోమవారం కోసిగికి చెందిన జొక్కుల ఈరేష్ అనే రైతుకు చెందిన ఎద్దు మేత తింటునే కిందపడిపోయి గిలగిల్లా కొట్టుకుంటూ మృతి చెందింది. ఈ దృశ్యాన్ని చూసిన రైతు కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోయారు. పశువైద్యులకు సమాచారం ఇవ్వగా పరీక్షించి మృతి చెందిందని నిర్ధారించారు. సుమారు ఎద్దు విలువ రూ. లక్ష ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎద్దుపై ఉన్న ప్రేమతో ట్రాక్టరులో తమ పొలానికి తీసుకెళ్లి ఎక్స్‌కవేటర్‌తో 20 అడుగుల గుంత తీసి అంత్యక్రియలు నిర్వహించారు.

ఆదాయం ఘనం..
మరమ్మతులు శూన్యం

● పెచ్చులూడుతున్న మున్సిపల్ దుకాణాలు
● ఆందోళనలో వ్యాపారులు



ఓ దుకాణం పైకప్పు పెచ్చులూడి కడ్డీలు కనిపిస్తున్న దృశ్యం



ఓపెన్ ఎయిర్ థియేటర్ పక్కన ఉన్న దుకాణంపై విరిగిపోయిన సన్‌సైడ్

ఎమ్మిగనూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పురపాలక సంఘానికి ఆదాయంలో ఆయువుపట్టుగా మున్సిపల్ దుకాణాలు ఉన్నాయి. ఏ మున్సిపాలిటీలో లేని విధంగా ఎమ్మిగనూరు మున్సిపాలిటిలో 272 దుకాణాలు ఉన్నాయి. ఎమ్మిగనూరు గ్రామపంచాతీ నుంచి మున్సిపాలిటీగా ఏర్పడినప్పటి నుంచి అంచెలంచెలుగా అప్పటి అధికారులు, పాలకులు పట్టణంలోని ప్రధాన రహదారులను ఆనుకొని ఉన్న మున్సిపల్ స్థలాల్లో దుకాణాలను నిర్మించారు. ఈ దుకాణాలను వ్యాపారులకు అద్దెకు ఇవ్వటంతో మున్సిపాలిటికి రూ. లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. అయితే ఎప్పుడో నిర్మించిన దుకాణాలు కావటం, నిర్వహణ లేకపోవటంతో పైకప్పులు పెచ్చులూడటం, సన్‌షైడ్‌లు కూలిపోవటం వంటివి జరుతున్నాయి. దీంతో వ్యాపారులు ఆందోళనకు గురువుతున్నారు.

పట్టణంలోని సోమప్ప సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ వాల్మీకి సర్కిల్, సంతమార్కెట్, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు ప్రాంతాల్లో 272దుకాణాలు నిర్మించారు. ఈ దుకాణాలను వేలం ద్వారా వ్యాపారులకు కేటాయిస్తున్నారు. ఒక్కోక్క దుకాణం నెల సరి అద్దె రూ. ఐదువేలు మొదలుకొని రూ. 15వేల వరకు ఉన్నాయి. ఈ దుకాణాల ద్వారా మున్సిపాలిటికి సాలీనా రూ. కోటి 60లక్షలు ఆదా యం వస్తోంది. ఇందులో సోమప్ప సర్కిల్‌నుంచి వాల్మీకి సర్కిల్ వరకు (సంతమార్కెట్), సోమప్ప సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ఉన్న ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న దుకాణాలు నిర్మించి దాదాపు 35ఏళ్లు గడుస్తోంది.

● **మరమ్మతులు నోచుకొని భవనాలు**

మున్సిపల్ దుకాణాలకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయకపోవటంతో దుకాణాల పైకప్పులు పెచ్చులూడుతున్నాయి. ప్రధానంగా పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం ఆనుకొని ఉన్న దుకాణాలు, సంతమార్కెట్‌ను ఆనుకొని ఉన్న దుకాణాలు నిర్మించి ఏళ్లు గడుస్తుండటంతో పైకప్పు పెచ్చులూడుతున్నాయి. గతంలో సంతమార్కెట్ పక్కన ఉన్న ఓ దుకాణం పైకప్పు ఏకంగా కూలిపోంది. అయితే ఆ సమయంలో ఎవరు లేకపోవటంతో ప్రమాదం తప్పింది. అలాగే ఓపెన్ ఎయిర్ థియేటర్ పక్కన ఉన్న దుకాణాల సన్‌షైడ్‌లు కూలిపోయాయి. అలాగే సోమప్ప సర్కిల్‌లో పాత జనతా హోటల్ ఉన్న భవనం పైఅంతస్తు సన్‌సైడ్ కూడా కూలిపోయింది. కొన్ని దుకాణాల్లో పైకప్పులు పెచ్చులూడుతూనే ఉన్నాయి. మరమ్మతులకు నోచుకోకపోవటంతో పైకప్పు ఇనుప కడ్డీలు తేలి ప్రమాదకరంగా కనిపిస్తున్నాయి.

● **ఊడుతున్న పెచ్చులు**

మున్సిపల్ దుకాణాలు మరమ్మతులకు నోచుకోక పోవడంతో కొన్ని దుకాణాల్లో పైకప్పులు పెచ్చులూడుతుండటంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది చేసేది లేక తామే సొంతగా మరమ్మతులు చేసుకొని కాలం వెళ్లబోస్తున్నారు. రూ. కోట్లలో ఆదాయం సమకూరుతున్నా మున్సిపల్ దుకాణాలకు మరమ్మతులు చేపట్టకపోవటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే దుకాణాలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కన్నుల పండువగా.. బసవేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవానికి హాజరైన జనం

కోసిగి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపాపురం గ్రామంలో బసవేశ్వరస్వామి రథోత్సవం సోమవారం అశేష భక్తజన వాహిని మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఈశ్వరయ్య, ధర్మకర్త సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం నుంచే స్వామివార్లకు విశేష పూజలు నిర్వహించారు. బసవేశ్వరస్వామి ప్రత్యేక పుష్పాలంకరణలో ముస్తాబు చేశారు. బసవేశ్వరస్వామిని టీడీపీ, వైసీపీ నాయకులు వేరేవేరు సమయాల్లో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, మంత్రాలయం టీడీపీ యువ నాయకులు రామకృష్ణారెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రదీప్ రెడ్డిలు స్వామివారిని దర్శించుకుని తమ నాయకులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల సమయంలో స్వామి వారి రథోత్సవాన్ని అశేష భక్తజనవాహిని మధ్య ఊరేగించారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చంద్రమోహన్ గట్టి పోలీసు బందోబస్తు నిర్వహించారు.

రోడ్లను ధ్వంసం చేస్తే కేసులు: డీఈ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రోడ్డును పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ డీఈ

కోసిగి, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎవరైనా ప్రభుత్వ ఆస్తులను, ఆర్‌అండ్‌బీ రోడ్లను పర్మిషన్ లేకుండా ధ్వంసం చేస్తే కేసులు నమోదు చేసి నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ డీఈ నాగరాజు హెచ్చరించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన కోసిగిలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రోడ్డు ధ్వంసం.. కథనానికి ఆయన స్పందించారు. ధ్వంసమైన కోసిగిలోని ప్రధాన సర్కిల్ మెయిన్ రోడ్డును డీఈ నాగరాజు, ఏఈ నరేష్ పరిశీలించారు. ధ్వంసానికి కారణమైన వ్యక్తుల ఇంటి వద్దకు వెళ్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. పంచాయతీ అధికారులు కూడా తమ పరిధిలోని ఆర్‌అండ్‌బీ రోడ్లను ఇష్టమొచ్చినట్లు ధ్వంసం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని, అధికారులపైన కూడా కేసులు నమోదు చేస్తామని తెలిపారు. గతంలో కూడా కోసిగిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ రోడ్డులో ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డును తవ్వి మట్టివేయడంతో గుంతలు పడి ప్రమాదకరంగా తయారైందని, దానిపై కూడా విచారించి దానికి కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఒకవేళ ఆ రోడ్డు పగులకొట్టాల్సిన అవసరం వస్తే ఆర్‌అండ్‌బీ అధికారులను సంప్రదించి ప్రభుత్వానికి డీడీ రూపంలో నగదు జమ చేసి పర్మిషన్ తీసుకుని తమ పనులు చేసుకోవాలని ఆర్‌అండ్‌బీ అధికారులు సూచించారు.

పద్మశాలీ బహుత్తమ సంఘం అధ్యక్షుడిగా పెద్ద రంగస్వామి



పెద్ద రంగస్వామి, విశ్వనాథ్ రమేష్‌లను సన్మానిస్తున్న సంఘం పెద్దలు

ఎమ్మిగనూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణం పద్మశాలీ బహుత్తం సంఘం, యువజన సంఘం అధ్యక్షులను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక పద్మశాలీ కల్యాణ మండపంలో సంఘం సర్వసభ్య సమావేశాన్ని సంఘం పెద్దలు గురుదాస్, మాకం నారాయణ, క్యాబర్సి శ్రీనివాసులు, శాషం శివదాస్ తదితరుల అధ్యక్షతన నిర్వహించారు. మెజారిటీ సభ్యుల అభిప్రాయం మేరకు పద్మశాలీ బహుత్తం సంఘం అధ్యక్షుడుగా చుంచ పెద్ద రంగస్వామి, ప్రధాన కార్యదర్శిగా పోలే ప్రసాద్, కోశాధికారిగా దోమ బీమేశ్వరిలతో పాటు ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే యువజన సంఘం అధ్యక్షులుగా విశ్వనాథ్ రమేష్‌ను ఎన్నుకున్నారు. బహుత్తం సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన చుంచ పెద్ద రంగస్వామి మాట్లాడుతూ కులపెద్దల సహకారంతో మార్కండేయస్వామి ఆలయ అభివృద్ధి కోసం, కల్యాణ మండపం, సంఘం అభ్యున్నతి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

కోసిగి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో వలసలు అరికట్టి ఉపాధి పనులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను వెంటనే కూలీలకు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం, సీఐటీయూ సీపీఎం నాయకులు కోరారు. సోమవారం సీపీఎం మండల కార్యదర్శి రాముడు, సీఐటీయూ నాయకుడు వీరేష్ కోసిగిలోని మేజర్ పంచాయతీ కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న తొమ్మిదివారాల ఉపాధి బిల్లులను వెంటనే మంజూరు చేయాలన్నారు. వేసవి కాలంలో ఉపాధి కూలీలకు టార్పాలిన్లు అందజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తాయన్న, వీరేష్, ఈరన్న, తిమ్మప్ప పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ట్రావెల్స్ యజమానులు

మంత్రాలయం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పట్టణంలో డ్రైవర్‌గా పనిచేస్తున్న సంగమేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో మంత్రాలయం ట్రావెల్స్ యజమానులు ఆర్థిక సాయం అందించి మానవత్వం చాటుకున్నారు. సోమవారం మృతున్ని కుటుంబాన్ని పరామార్శించి మృతుడి భార్యకు ధైర్యం చెప్పి పిల్లలను బాగా చదివించాలని సూచించారు. బాధిత కుటుంబానికి రూ.31వేల నగదు, 25 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో వడ్డె నారాయణ, అమీన్‌బాషా, నరేష్, రఘు, ఈషప్ప, విజయ్, ఎల్లయ్య, ఖాజా పాల్గొన్నారు.

ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు కస్తూర్బా పాఠశాలలో విద్యార్థుల కడుపు కొట్టిన ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు కృష్ణ, సురేంద్రబాబు, వెంకటేష్ మాట్లాడుతూ ఎస్‌వో పోస్టింగ్‌ను రద్దు చేసి, ఉద్యోగం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సొమ్మును రికవరి చేయాలన్నారు. సమావేశంలో ఇమ్రాన్, రాజు, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి



ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంత్రాలయం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఎంఈవోపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌యూ, ఆర్‌యూఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి సురేష్, రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ మాట్లాడుతూ ఒక హెచ్ఎం, ఇద్దరు టీచర్లను ఎమ్మార్సీలో ఉపయోగించుకుంటున్నారన్నారు. ఆయా పాఠశాలలో బోధన చేయాల్సిన ఉపాధ్యాయులను ఎంఆర్సీలో ఉంచుకోవడం సరికాదన్నారు.

హాస్టళ్ల భవనాలకు నిధులు విడుదల చేయాలి

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల నూతన భవనాలు నిర్మాణం కోసం నిధులు విడుదల చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి కోరారు. సోమవారం రాజధాని అమరావతిలో అసెంబ్లీ సమావేశాల విరామ సమయంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. నిధులు మంజూరుకు మంత్రి సానుకూలంగా స్పందిచారన్నారు. అధికారులు త్వరితగతిన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు.

పంచాయతీ ఆదాయాన్ని పెంచాలి

గోనెగండ్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో ప్రజలు తమ ఇళ్లల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త బండ్లలోనే వేయాలని ఈవోఆర్డీ అనంతశయనా కోరారు. సోమవారం గోనెగండ్లలోని పలు వీధుల్లో ఈవోఆర్డీ, గ్రామ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్, గ్రామ వార్డు సభ్యులు పర్యటించారు. ప్రతి ఇంటికి తడి, పొడి చెత్తలను వేసుకునేందుకు గాను రెండు ప్లాస్టిక్ డబ్బాలను అందజేశారు. కార్యాక్రమంలో పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుభాన్, అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

గోనెగండ్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని గోనెగండ్ల మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు బైలుప్పల వెంకటేశ్వర్లు, తాటికోండ వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం మండల కార్యదర్శుల సంఘం సభ్యులు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్, తిరుమల, ప్రభాకర్, నరసన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయం



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

గోనెగండ్ల, మార్చి 10(ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలే సేవలు చిరస్మరణీయమని కేవీపీఎస్ నాయకుడు కరుణాకర్ అన్నారు. సోమవారం సావిత్రిబాయి పూలే వర్ధంతిని గోనెగండ్లలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గోనెగండ్లలోని బస్టాండ్ ప్రాంగణంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు మునిస్వామి, మారేష్, ఆటో యూనియన్ నాయ కులు వీరేన్నగౌడ్, వీరేష్, శ్రీను, వలి, లాజర్ పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించాలి



పెన్నులు, ప్యాడ్లతో విద్యార్థినులు

ఎమ్మిగనూరు టౌన్/నందవరం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని అపాస్ జిల్లా గౌరవ అధ్యక్షులు నరసప్ప అన్నారు. సోమవారం పట్టణంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల పదవ తరగతి విద్యార్థినులకు రాణి అహల్యాబాయి హోల్కర్ స్వచ్ఛంద సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో సమకూర్చిన పెన్నులు, ప్యాడ్లను నరసప్ప అందజేశారు. ఒత్తిడికిలోను కాకుండా, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ, ఏకాగ్రతతో చదివి పరీక్షలో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. కార్యక్రమంలో వీరేష్, శ్రీహరి, గజేంద్ర పాల్గొన్నారు. అలాగే నందవరం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల పదవ తరగతి విద్యార్థినులకు సోమవారం హోల్కర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పెన్నులు, ప్యాడ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో రఘునాథ్ మాట్లాడుతూ విద్యార్థులు మెలకువలతో చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజ, కూలురు వీరేష్, శ్రీహరి, గజేంద్ర, సూరి, దామోదర్, కనకవీడు రవి పాల్గొన్నారు.

23 నుంచి శ్రీమన్ న్యాయసుధ మంగళ మహోత్సవం

మంత్రాలయం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠంలో ఈ నెల 23 నుంచి 24 వరకు శ్రీమన్ న్యాయ సుధ మంగళ మహోత్సవాన్ని నిర్వహించను న్నట్లు ఏఏవో మాధవశెట్టి, మేనేజర్ వెంకటేశ్ జోషి తెలిపారు. 23న గురుసార్వభౌమ సంస్కృత పాఠశాల విద్యార్థులతో సంస్కృత విద్యపై అనువాదం, విద్వాంసులచే ప్రవచనాలు, సంగీత ఇష్టాగోష్టి, సంస్కృత గ్రంథాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 24న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సుధానువాదం, పండితులనుద్దేశించి ఉపన్యసించడం, ఫల మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి పండితులను సన్మానిస్తున్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పండిత కేసరి విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్ ఆధ్వర్యంలో శ్రీమన్ న్యాయసుధ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్రంలోని వివిధ సంస్కృత వేద విద్వాంసులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు.

ఆరుగురు విద్యార్థుల ఎంపిక

మంత్రాలయం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహించిన వివిధ ప్రాజెక్టులలో ఇన్‌స్పైర్ మనక్ కింద ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు సూగూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం లచ్చప్ప, ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగభూషణం తెలిపారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంలో విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాల్లో సూగూరు పాఠశాల నుంచి 7వ తరగతి విద్యార్థులు షేక్ హసీనాభేగం, పుట్ట వీరేంద్ర ఎంపికైనట్లు తెలిపారు. అదే విధంగా ఎస్ఎంకేఈ ప్రభుత్వ పాఠశాల నుంచి 9వ తరగతి చదువుతున్న జ్యోతి, 8వ తరగతి చదువుతున్న ప్రభుకుమారి, 7వ తరగతి జానకీ, మాబీ ఎంపికయ్యారని తెలిపారు. వీరి ఎంపిక పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, స్కూల్ కమిటి చైర్మన్లు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు షైనుద్దీన్, రాగన్న, పీఈటీలు లక్ష్మీకాంత్, రవీంద్ర అభినందనలు తెలియజేశారు.

ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి: సీపీఐ



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

నందవరం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఆర్డీఎస్ కుడికాలువ, వేదావతి, గుండ్రేవుల ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నన్నగౌడు డిమాండ్ చేశారు. సోమవారం నందవరం బస్టాండ్‌లో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమేశ్వరరెడ్డి, గిడ్డయ్య, తాయన్న, శాంతన్న, ఎంకన్న, నరసన్న, రామన్నగౌడు, షేక్షావలి పాల్గొన్నారు.